ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

1

శుక్రవారం 26 ఏప్రిల్ 2024



నామినేషన్‌కు హాజరైన జనసందోహం

పెదకూరపాడు జనసంద్రం

- అట్టహాసంగా భాష్యం ప్రవీణ్ నామినేషన్
- ర్యాలీకి వేలాదిగా తరలివచ్చిన కూటమి శ్రేణులు

పెదకూరపాడు, ఏప్రిల్ 25: మండే ఎండైనా తగ్గేదేలేదు అంటూ వృద్ధులు, మహిళలు తరలిరాగా.. యువత సందడి మధ్య పండుగ వాతావరణంలో గురువారం కూటమి తరఫున పెదకూరపాడు టీడీపీ అభ్యర్థిగా భాష్యం ప్రవీణ్ నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చారు. బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, పెదకూరపాడు మండల గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, సానుభూతిపరులు సుమారు 30 వేల మంది తరలిరావడంతో పెదకూరపాడు రోడ్లన్నీ జన సంద్రంగా మారాయి. బాష్యం ప్రవీణ్ జిందాబాద్.. టీడీపీ జిందాబాద్.. కాబోయే ఎమ్మెల్యే ప్రవీణ్.. అంటూ నినాదాలతో పెదకూరపాడు మారుమోగింది. డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ సందడి, బాణ సంచా మోతలు, కార్యకర్తల కేరింతల మధ్య ప్రవీణ్ నామినేషన్ కార్యక్రమం జరిగింది. తొలుత తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో ప్రవీణ్ సాయి బాబా గుడిలో, అంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి అమరావతి మండలం నుంచి ర్యాలీ చేపట్టారు. దారిపొడవునా మహిళల మంగళ హారతులు, వృద్ధుల ఆశీస్సుల మధ్య ప్రవీణ్ ర్యాలీ ముందుకు సాగింది. బలుసుపాడులో టీడీపీ నాయకులు ప్రవీణ్‌ను గజమాలతో సత్కరించి, స్వాగతం పలికారు. ర్యాలీలో ప్రవీణ్ ప్రచార రథంపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా ప్రజలకు అభివాదం చేస్తూ ఉత్సాహపరిచారు. పెదకూరపాడులో స్వాగత ద్వారాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ నేత మేదరమెట్ల సౌమిత్‌చౌదరి ప్రవీణ్‌ను అంబేద్కర్ సెంటర్‌లో గజమాలతో సత్కరించారు. పెదకూరపాడులోని నాగమల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరావతిలో ప్రవీణ్ చేపట్టిన ర్యాలీ కొందరు రైతులు ట్రాక్టర్లతో తరలివచ్చారు. ర్యాలీలో టీడీపీ, జనసేన, బీజేపీ, ఎమ్మార్పీఎస్ జెండాలు రెపరెపలాడాయి. మహిళలు గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. యువకులు ద్విచక్ర వాహనాలు, కార్లతో ర్యాలీలో పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న భాష్యం ప్రవీణ్ దంపతులు

బైక్‌పై వెళ్లి నామినేషన్

అనుకున్న ముహూర్తంలో నామినేషన్ వేసేందుకు ప్రవీణ్ బైక్‌పై వెళ్లాల్సి వచ్చింది. ర్యాలీకి వివిధ ప్రాంతాల నుంచి ఊహించిన దానికంటే ఎక్కువగా ప్రజలు తరలిరావడంతో దారిపొడవునా ట్రాఫిక్ జామైంది. ర్యాలీ లింగాపురం వద్దకు చేరుకుంటుండగా నామినేషన్ సమయం దగ్గర పడటంతో ప్రవీణ్ బైక్‌పై పెదకూరపాడు ఆర్వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్‌ను దాఖలు చేశారు. దీంతో లింగాపురం, బలుసుపాడు, పరస, కాశిపాడు, 75 త్యాళ్లూరు, అబ్బరాజుపాలెం గ్రామాల్లో ప్రవీణ్‌కు ఘనస్వాగతం పలికేందుకు ఎదురు చూసిన వారు నిరాశకు గురయ్యారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మన్ షేక్ షరీఫ్, టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారు రాజన్‌బాబు, భాష్యం ఆంజనేయులు, జనసేన రాష్ట్ర నాయకులు బోనబోయిన శ్రీనివాసయాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీడీపీ నాయకురాలు పఠాన్ నూర్జహాన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వరప్రసాద్, బీజేపీ, జనసేన నియోజకవర్గ అధ్యక్షులు వెంగళరెడ్డి, యర్రంశెట్టి రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్తిమళ్ల రమేష్, పెదకూరపాడు మండల జనసేన అధ్యక్షుడు మల్లెల వెంకట చలపతిరావు, ప్రవీణ్ సతీమణి లావణ్య, పెద్ద కుమారుడు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, భాష్యం ప్రవీణ్, వంగవీటి రాధా తదితరులు



ర్యాలీలో పాల్గొన్న కూటమి నేతలు, కార్యకర్తలు

నెరవేరని జలకళ

- మూడున్నరేళ్లు.. 139 బోర్లు
- బోర్ల పథకం అమలులో బొక్కబోర్లా
- రైతులకు అక్కరకురాని జలకళ
- బోర్లు నిర్మించి ఉంటే పంటలు పండేవి
- మొక్కుబడిగా బోర్ల నిర్మాణం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ద్రోహం
- ఇదీ జలకళలో జగనన్న సాధించిన ఘనత

జలకళ పురోగతి క్లస్టర్‌ల వారీగా ఇలా..

క్లస్టర్	దరఖాస్తుల సంఖ్య	అమోదించినవి	నిర్మించిన బోర్లు
నరసరావుపేట	823	715	104
సత్తెనపల్లి	1,895	1,532	134
మాచర్ల	5,072	4,178	757
వినుకొండ	2,597	1,986	203
బాపట్ల	314	236	76
చీరాల	4,241	1,547	821
గుంటూరు	198	157	11
తెనాలి	283	234	149
మొత్తం	15,423	10,585	2,235



నరసరావుపేట మండలం పమిడిమర్రు ప్రాంతంలో నిర్మించిన వ్యవసాయ బోరు

జలకళ పథకాన్ని అటకెక్కించారు. ఎన్‌టీఆర్ జలసిరి.. వైఎస్‌ఆర్ జలకళగా పేరు మార్చేసిన ప్రభుత్వం బోర్ల నిర్మాణాన్ని విస్మరించింది. పేరు మా ర్చుకోవడంలో శ్రద్ధ చూసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి పథకం అమలుకు పైసలివ్వలేదు. సాగునీటి సంక్షోభంలో జలకళ అన్నదాతలను ఆదుకోలేక పోయింది. ప్రభుత్వం వ్యవసాయ బోర్లు నిర్మించి ఉంటే రైతులు పంటలు సాగు చేసేవారు. సాగునీరు లేక జిల్లాలో లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారాయి. రైతుల కల మన వైఎస్‌ఆర్ జలకళ అనే నినాదంతో ప్రవేశపెట్టిన జలకళ పథకం అమలులో ప్రభుత్వం బొక్కబోర్లా పడింది. మూడున్నరేళ్ళుగా జలకళను ప్రభుత్వం సాగదీసింది. బోర్ల నిర్మా ణానికి నిధులు కేటాయించడంలో చేతులెత్తేసింది. ఇప్పటికి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,235 బోర్లు మాత్రమే నిర్మించా రు. జలకళ అమలు లో ప్రభుత్వా నికి చిత్తశుద్ధి లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల రైతులకు తీరని అన్యాయం చేసింది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

బోర్ల నిర్మాణం కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూశారు. మొక్కు బడిగా జలకళను అమలు చేశారు. రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న పాలకులు బోర్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై వారు నోరు మెదపలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 15,423 మంది రైతులు బోర్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేశారు. వీటి లో 10,545 దరఖాస్తులను ఆమోదించినప్పటికీ 2,235 బోర్లు మాత్రమే నిర్మించారు. బోర్ల నిర్మాణం 21.94 శాతమే. నిర్మించిన బోర్లకు బిల్లులు చెల్లింపులు నిలిచి పోయాయి. రూ.22.56 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.72.36 లక్షలు చెల్లించారు. దీంతో బోర్ల నిర్మాణాన్ని కాంట్రాక్టర్లు నిలిపి వేశారు. బోర్లకు మోటార్లు అమర్చడంలో, విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరిగింది. విద్యుత్ కనెక్షన్‌లు లేక వందలాది బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో బోర్లు అందు బాటులోకి రాకపోవడంలో వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు.

కళ్లు కాచేలా ఎదురు చూశారు..

చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయ బోరు బావులను ఉచితంగా నిర్మించేందు కు జళకలను ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశ పెట్టి అమలులో చతికిలపడింది. బోరు బావుల కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది రైతులు వీటి నిర్మాణం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. పథకం అమలులో ప్ర భుత్వం పూర్తిగా విఫలమైంది. వ్యవసాయంపై ఆధా రపడిన రైతులకు బోరు బావులతో సాగునీటి భరోసా కల్పించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. చిన్న, సన్న కారు రైతులను ఉచిత బోరు బావుల పథకం ఆదుకోలేకపోయింది. వ్యవసాయ యోగ్యమైన భూమి ప్రతి ఎకరానికి సాగులోనికి తెస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఆచరణను విస్మరించింది. బోర్ల నిర్మాణం కోసం ఏళ్ల తరబడి ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలకు అడియాసే మిగిలింది. ప్రధానంగా నిధుల కొరత వెంటాడుతోంది. నిర్మించిన బోర్లకు పూర్తి స్థాయిలో బిల్లుల చెల్లింపులు జరగకపోతుండటంతో బోర్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. నిర్మాణం పూర్తయిన బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో కూడా జాప్యం జరుగుతూనే ఉంది. దీంతో వందలాది బోర్లు నిరుపయోగంగా మారాయి. నెలల తరబడి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అవి పూడిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు నిర్మించి ఉంటే వేలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసి ఉండేవారు.

- బోర్ల నిర్మాణానికి దరఖాస్తులు : 15,423
- అమోదించిన దరఖాస్తులు : 10,545
- నిర్మించిన బోర్లు : 2,235
- బోర్లు నిర్మాణం శాతం : 21.94
- విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చిన బోర్లు : 263
- మోటార్లు అమర్చిన బోర్లు : 139
- నిరూపయోగంగా ఉన్న బోర్లు : 2,096

ఆ రైతులకు తీరని అన్యాయం

సీఎం జగన్ నా అని చెప్పుకొనే అన్నదాలకు ఒరగబెట్టింది ఏమీ లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన రైతులు బోర్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి కూడా బోర్ల నిర్మాణం చేపట్టలేదు. అదే బోర్లు నిర్మించి ఉంటే కరువు పరిస్థితుల్లో సదరు రైతులు పంటలు పండించి ఆర్థిక లబ్ధి పొం దేవారు. జగన్ వైఖరి కారణంగా ఆయా వర్గాలు సాగు చేసిన పంటలకు నీరు లేక తీవ్రంగా నష్టపోయారు. ఆయా వర్గాలకు చెందిన 10,191 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. బోర్లు మంజూరు లోనూ అన్యాయమే జరిగిందనేది లెక్కలు చెబుతున్నాయి. 8,342 దరఖాస్తులను మాత్రమే ఆమోదించారు. వీరికి సంబంధించిన బోర్ల నిర్మాణ తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆమోదించిన దరఖాస్తులలో కేవలం 1,531 బోర్లు మాత్రమే నిర్మించారు. బోర్ల నిర్మాణం 18.35 శాతానికే మూడేళ్లుగా పరిమితం అయ్యాయంటే నా.. నా అని చెప్పు కోనే వాళ్ల విషయంలోనూ జగన్ కు చిత్తశుద్ధి లేద నేది వాస్తవం అని జలకళ స్పష్టం చేస్తోంది.

ఇక నిర్మించిన బోర్ల విషయానికి వస్తే.. !

జలకళ కింద నిర్మించిన బోర్లుకు విద్యుత్ కనెక్షన్లు, మోటార్లు ఇవ్వడంలోనూ అలసత్వం తాడవిస్తోందని చెప్పవచ్చు. 2,235 బోర్లు జిల్లాలో నిర్మించారు. మూడు జిల్లాల్లో 263 బోర్లకు మాత్రమే విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు. వీటిలో కేవలం 139 బోర్లకు మోటార్లు అమర్చారు. 2,096 బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. నిధుల విడుదల తీవ్ర జాప్యం వలనే కనెక్షన్‌లు ఆలస్యం అవుతున్నదని అధికారులు చెప్పకనే చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో 197 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వగా వీటిలో 60 బోర్లకు మాత్రమే మోటార్లు బిగించారు. బాపట్ల జిల్లాలో 50 బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వగా ఒక్క బోరుకు కూడా మోటారు బిగించకపోవడం గమనార్హం. గుంటూరు జిల్లాలో 116 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వగా 79 బోర్లకు మాత్రమే మోటార్లు అమర్చారు. 2,235 బోర్లు నిర్మిస్తే కేవలం 139 బోర్లు మాత్రమే వినియోగంలోకి వచ్చాయంటే ఈ పథకం పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైందని చెప్ప వచ్చు. బోర్లు నిర్మించి నెలలు గడుస్తుండటంతో వినియో గించకపోతే అవి పూడిపోతాయన్న ఆందోళన రైతుల నుంచి వ్యక్తమవుతోంది. జలకళ కింద బోర్లు నిర్మాణ పూర్తి చేసి ఉంటే ఖరీఫ్, రబీ సీజన్‌లలో వేలాది ఎకరా ల్లో రైతులు పంటలు పండించి ఆర్థికంగా లబ్ధిపొందేవారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారీగా బోర్ల నిర్మాణం ఇలా

వర్గం	దరఖాస్తులు	అమోదించినవి	బోర్ల నిర్మాణం
ఎస్టీ	2,745	2,256	191
ఎస్సీ	1,616	1,294	209
మైనార్టీ	271	213	34
బీసీ	5,499	4,579	1,097
మొత్తం	10,131	8,342	1,531



వెల్దుర్తి మండలంలో బోరు నిర్మాణం


ఆటోనగర్ కార్మికులతో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని, పక్కన నజీర్, నంబూరు సుభాని, దేగల ప్రభాకర్

టీడీపీతోనే ఆటోనగర్ అభివృద్ధి

● గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తేల్చిచెప్పారు. గుంటూరు ఆటోనగర్‌లో గురువారం జరిగిన మోటార్ ఫీల్డ్ అసోసియేషన్ ఆత్మీయసమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆటోనగర్ అభివృద్ధిని విస్మరించారని, ఎంతో మంది జీవనోపాధి పొందుతున్న మోటారు వర్కర్లపై ఎమ్మెల్యే ముస్తఫా చిన్నచూపు చూశారని ఆరోపించారు. మౌలిక సదుపాయాలు లేక ఆటోనగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, వైసీపీ ప్రభుత్వంలో హామీలు ఇచ్చారు తప్ప ఇటువైపు తిరిగి చూడలేదని విమర్శించారు. ముస్లింలను కూడా వైసీపీ పట్టించుకోలేదని, గతంలో ముస్లిం మైనారిటీలను టీడీపీ ప్రభుత్వం అనేక రాజకీయ పదవులు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని స్పష్టం చేశారు. కూటమి తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నసీర్ మాట్లాడుతూ ఆటో నగర్ వ్యాపారులకు, మెకానిక్‌లకు అండగా ఉంటామన్నారు. దుకాణాలు లేని వారికి కొత్తగా దుకాణాలు నిర్మించి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు నంబూరు సుభాని, రావి వెంకటరమణ, టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్, నాయకులు షబ్బీర్, ముజీబ్, భరత్ రెడ్డి, ఉగ్గిరాల సీతారామయ్య, గౌస్, ఆటోనగర్ నాయకులు అబ్దుల్లా, ఖలీల్, భాషా, ముకబుల్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో జంగాకు అరుదైన గౌరవం

● నరసరావుపేట పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా నియామకం


జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల, ఏప్రిల్25: ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి టీడీపీలో సముచిత స్థానం లభించింది. వైసీపీని వీడి గత నెలలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన జంగా కృష్ణమూర్తిని టీడీపీ నరసరావుపేట పార్లమెంటరీ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా నియమించింది. ఈమేరకు అధినేత చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. టీడీపీలో బీసీలకు సముచిత స్థానం లభిస్తుందనేందుకు జంగా నియామకమే నిదర్శనమని గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా జంగా కృష్ణమూర్తిని యరపతినేని శ్రీనివాసరావు అభినందించారు.

తనిఖీల్లో నగదు సీజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 25: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో రూ.1,00,000, రూ.81,000 నగదు సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీల్లో ఏప్రిల్ 25వ తేది సాయంత్రం 6 గంటల వరకు రూ.2,43,07,165ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

సాగునీరు, ఉద్యోగాల కల్పనే లక్ష్యం


టీడీపీలో చేరిన తిమ్మాపురం వారితో జీవీ, లావు శ్రీకృష్ణదేవరాయులు

● నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయులు
● వైసీపీని వీడి పలువురు టీడీపీలోకి చేరిక..

వినుకొండటౌన్, ఏప్రిల్ 25: నియోజకవర్గం నుంచి పలు గ్రామాలకు చెందిన వారు అధికార వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. నూజండ్ల మండలం తిమ్మాపురం గ్రామం 11 కుటుంబాలు, వినుకొండ పట్టణం 2వ వార్డుకు చెందిన 5 కుటుంబాలు, బొల్లాపల్లి మండలం కనుమలచెరువు గ్రామం నుంచి 5కుటుంబాల వారికి వినుకొండలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతోపాటు ఎంపీ అభ్యర్థి శ్రీలావు కృష్ణదేవరాయులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కృష్ణదేవరాయులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అరాచకాలను తట్టుకోలేని వందలాది కుటుంబాలు నేడు పార్టీని వీడుతున్నారని, అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని తెలిపారు. జీవీ మాట్లడుతూ బొల్లా అవినీతి అక్రమాలు మితిమీరిపోయాయని, బొల్లా గెలుపుకోసం అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలు గుర్తింపు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధానంగా గ్రామాల్లో మంచినీటి సౌకర్యం తోపాటు రైతులకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ రాక్షస పాలన అంతమొందించాలన్నారు. నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే మ్యేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు ప్రజల నుంచి విశేష ఆదారణ లభించిందన్నారు. ప్రజలంత కలిసికట్టుగా కులమతాలకు అతీతంగా తెలుగుదేశంపార్టీకి ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రాథమిక స్థాయి నుంచే భాష్యం ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ

● జాతీయ స్థాయి ర్యాంకుల సాధనకు ఇదే మార్గం
● భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ


ర్యాంకర్లకు కేక్ తినిపిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య),ఏప్రిల్ 25: ప్రాథమిక స్థాయి నుంచే భాష్యం ఐఐటి ఫౌండేషన్‌కరిక్యులమే ఐఐటి జేఈఈ ర్యాంకుల సాధనకు కారణమని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మెయిన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు ఐఐటి, మెడిసిన్ కోసం కోచింగ్ క్యాంపస్‌లు లేవని గుంటూరులోనే 6వ తరగతి నుంచే ఐఐటి ఫౌండేషన్‌మెడిసిన్ కోసం తరగతులు ప్రారంభించి శిక్షణ అందిస్తామని వివరించారు. ఫలితంగా ఇటు ఐఐటీల్లో, అటు మెడిసిన్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలోనే ఎం. జిష్ణుసాయి ఆలిండియా టాప్ మార్కు 300కి 300 మార్కులు సాధించి 100 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 18వ ర్యాంకును, ఎం.సాయియశ్వంత్‌రెడ్డి 100 పర్సంటైల్తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 36వ ర్యాంకును, ఈడబ్ల్యూఎస్ విభాగంలో ఆలిండియా 4వ ర్యాంకును కైవసం చేసుకున్నారని తెలిపారు. ఇంకా ఆలిండియా స్థాయిలో డి.భరత్‌చంద్ర 20వ ర్యాంకు, కేజే. వివేక్ 33, జీ. జాన్ 49, కే. హర్షిత 50 , పి.శ్యామ్ 62, జే. మణిప్రదీప్ 69, కే. చైతన్య 77, ఎ.గణేషదత్తా 78, కే.శ్రేయ 82 ర్యాంకులు సాధించారని వివరించారు. ర్యాంకర్లను భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావులు, భాష్యం ఐఐటి జేఈఈ కోఆర్డినేటర్ ఆనంద్ తదితరులు అభినందించారు.

ఐఐటి బాంబేలో సీటు సాధనే లక్ష్యం



జేఈఈ అడ్వాన్స్ లో మెరుగైన రాంకు సాధించిన ఐఐటిబాంబేలో కంప్యూటర్‌సైన్స్ సీటు సాధించడమే లక్ష్యమని జేఈఈ మెయిన్స్‌లో 18 వర్యాంకు సాధించిన ఎం.జిష్ణుసాయి పేర్కొన్నారు. భాష్యం అధ్యాపకుల ప్రత్యేక ప్రణాళికతో కూడిన బోధన, గౌడెన్స్‌లతో పాటు తల్లిదండ్రులు జ్యోతి,కృష్ణమోహన్ ప్రోత్సాహంతో ఉందన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే మెరుగైన ఫలితాలు



జాతీయ స్థాయిలో జరిగే పరీక్షలో ఒత్తిడినిఅధిగమిస్తే మెరుగైన ర్యాంకు సాధించవచ్చునని జేఈఈ మెయిన్స్‌లో 36వ ర్యాంకు సాధించిన ఎం సాయి యశ్వంత్‌రెడ్డి తెలిపారు. తల్లిదండ్రులు అరుణారెడ్డి,రామేశ్వర్ ప్రోత్సహం మరవలేని దన్నారు. 6వ తరగతి నుంచే అధ్యాపకులు ఇచ్చిన ప్రణాళికతో నూరుశాతం పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు.

బూత్ వద్ద నన్ను బలిస్తారట..

● టీడీపీ నేత అంకారావు యాదవ్
● వైసీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు

కారంపూడి, ఏప్రిల్ 25: ఎన్నికల రోజున పోలింగ్ బూత్ వద్ద నన్ను బలిస్తామని వైసీపీ నేతలు డీలర్ సూరె వెంకయ్య, మోసయ్య బ్రదర్స్ బెదిరిస్తున్నారని, గురువారం ఉదయం తనపై దాడి చేసి వెళ్లారని టీడీపీ నేత అంకారావు అన్నారు. మండలంలోని చింతపల్లిలో జరిగిన ఈదాడి ఘటనపై కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఆయన టీడీపీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీలో ఇమడ లేక ఆపార్టీకి రాజీనామా చేసి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సమక్షంలో తాను టీడీపీలో చేరినట్లు చెప్పారు. ఇది సహించలేని మోసయ్య బ్రదర్స్ ఇరువురు తనపై దాడి చేసి హత్య చేస్తామని బెదిరించారన్నారు. మాపార్టీ మారుతావా అంటూ తనపై పిడిగుద్దులు కురిపించారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బ్రహ్మారెడ్డి గెలుపు వన్‌సైడ్ అని తేలిపోయిందన్నారు. ఇది సహించలేకనే వైసీపీనేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇంతకింత ప్రతీకారం తీర్చుకుంటామని, బ్రహ్మారెడ్డి నాయకత్వంలో ప్రతి దుర్మార్గుడికి బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జాని, సీనియర్ నేత చప్పిడి రాము, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వెంకటపాలెం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

వైసీపీకి ఓట్లు అడిగే అర్హత లేదు

● 1591వ రోజుకు చేరుకున్న రైతుల నిరసనలు

తుళ్లూరు, ఏప్రిల్25: అమరావతి అభివృద్ధిని విస్మరించిన వైసీపీకి ఓట్లు అగిగే అర్హత లేదని రాజధానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద నుండి చేస్తున్న ఆందోళనలు, నిరసనలు గురువారం నాటికి 1591వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, మూడు ముక్కలాటతో సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి లేకుండా చేశాడన్నారు. పరిపాలన చేయటం చేత కాని వారు మూడు రాజధానులు పెట్టి ఉద్ధరిస్తామని చెప్పటం హాస్యాస్పదమన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి.

రెండు చోట్ల నగదు పట్టివేత

చిలకలూరిపేట,ఏప్రిల్ 25: ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బృందాలు గురువారం బొప్పూడి చెక్ పోస్టు వద్ద మొత్తం రూ.3.19 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం గ్రామానికి చెందిన మర్లపాటి శ్రీనివాసరావు వద్ద నుంచి రూ.1.50 లక్షలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మరొక సంఘటనలో ఇంకొక వ్యక్తి వద్ద నుంచి రూ.1.69 లక్షలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు.


టెయిల్‌పాండ్ ప్రాజెక్టు మెయిన్ డ్యాం

కృష్ణానది వద్ద ఏది నిఘా ?

రెంటచింతల, ఏప్రిల్ 25: వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా వున్న కృష్ణానది తీరంలో మరింత నిఘాను పెడితే అక్రమాలను అరికట్టవచ్చు. తెలంగాణాలోని చాలా గ్రామాలు ఏపీకి సరిహద్దుగా వున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి చెక్ పోస్టులను ఇరువైపులా ఏర్పాటు చేశారు.ప్రస్తుతం కృష్ణానదిలో నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉంది. మరపడవలు, తెడ్ల పడవలను వినియోగించి నీటిని దాటుతున్నారు. దీంతో నగదు, మద్యం, నాటుసారా మత్తు పదార్థాలు రహస్యంగా రవాణా చేస్తున్నారు. ఏపీలో మద్యం అన్ని బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ నుంచి రవాణా చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని మద్యం తాగి చాలా మంది మృత్యువాత పడగా మరికొందరు రోగాల బారిన పడి వైద్య చికిత్సలు పొందుతున్నారు. ఎస్పీఎఫ్ సిబ్బంది ఒక ఎస్ఐతో సహా మరో 16 మంది ఇరువైపులా డ్యాంపై పహరా కాస్తున్నారు. ఈ క్రమంలో నది ఒడ్డున నిఘాను పెంచితే అక్రమాలను అరికట్టవచ్చు.

సాగర్ కుడి కాలువకు నీటి నిలిపివేత

విజయపురిసౌత్, ఏప్రిల్ 28: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కుడి కాలువకు గురువారం అధికారులు నీటిని నిలిపివేశారు. తాగునీటి నిమిత్తం 8 టీఎంసీల నీటిని కుడి కాలువ ద్వారా 17 రోజులపాటు విడుదల చేశారు. వాటా పూర్తి కావడంతో నీటిని నిలుపుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద
రూ.25,47,324 స్వాధీనం

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాం ప్రసాద్ వెల్లడి


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 25: నామినేషన్ పర్వం గురువారంతో ముగిసింది. మాచర్ల అసెంబ్లీ స్థానానికి 24 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాం ప్రసాద్ తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం స్క్రూట్నీ కార్యక్రమం నిర్వహిస్తామని, అర్హులైన అభ్యర్థుల తుది జాబితాను సాయంత్రానికి వెల్లడిస్తామన్నారు. అలాగే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఇప్పటి వరకు రూ.25,47,324 పట్టుకున్నట్లు చెప్పారు. రూ.13.74 లక్షల విలువైన తెలంగాణ మద్యం సీజ్ చేశామన్నారు. వికలాంగులు, 85 పైబడిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు వేసుకునేందుకు ఫారం-12డి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2 వేల మంది అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రధాన రాజకీయ పార్టీలపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు నమోదైనట్లు తెలిపారు.

66,153 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 62,762 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 66,153 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 45,199 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	18000
నెంబరు. 5	8500	13500
273	12000	16000
341	8000	16000
4884	9000	12500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	8000	16000
దేవనూరు డీలక్స్	8500	16000
తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

బాధితులకు అండగా ఉంటాం..

● నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయులు


చికిత్సపొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న శ్రీకృష్ణదేవరాయులు

నసరావుపేటటౌన్, ఏప్రిల్ 25: బాధితులకు అండగా ఉంటామని, ఘటన కారకులు, సూత్రధారులకు కఠినంగా శిక్షపడేలా చూస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గురువారం ఈపూరు మండలం ఇనుమెళ్ళలో వైసీపీ మూకల దాడిలో గాయపడి నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిం చారు. ఈసందర్భంగా శ్రీకృష్ణదేవ రాయలు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలపై దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రశాంతంగా ఉన్న పల్నాడులో గొడవలు సృష్టించడం బాధాకరం అన్నారు. ఘటనలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు సీతారామాంజనేయులు, చలమయ్య, నాగార్జున, నాగేశ్వరరావు, కుమారిలను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కారుకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బిందుమాదవ్‌కు ఫోనులో విన్నవించారు. మంచి వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.


విద్యార్థులతో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం దుర్గాప్రసాద్ తదితరులు

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన శ్రీచైతన్య

గుంటూరు(విద్య),ఏప్రిల్25: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గుంటూరుజోన్ శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు జోన్ విద్యార్థులు అన్ని కేటగిరిల్లో మెరుగైన ర్యాంకులు సాధించారని తెలిపారు. ఎస్.భార్గవ్‌రెడ్డి 36వ ర్యాంకు, కే. సుమంత్‌రెడ్డి 70, పీ.ప్రవీణ్‌కుమార్ 131, కే.లోకేశ్ 157, షేక్ రజియా 166, ఎస్.వెంటక అస్మిత 340, కే.రామగోపాల్ 394, పీ.జ్యోతిక 410, కే.తేజవర్ధన్ 626, వీ.శేషప్రియ 683, పీ.మణికంఠ 793, పీ.రుషితరెడ్డి 924 ర్యాంకులు సాధించారని తెలిపారు. అంతేకాకుండా 1000 లోపు 12 మంది, 2000 లోపు 35 మంది, 5000 లోపు 72 మంది, 10 వేల లోపు 153 మంది ర్యాంకులు సాధించారని వెల్లడించారు. విద్యార్థులను కళాశాల డీన్స్ కిషోర్ కుమార్, చంద్రశేఖర్, కృష్ణ, అసోసియేట్ డీన్ హరిబాబు, ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యం, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా
కనపర్తి శ్రీనివాసరావు


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా వున్న కనపర్తి శ్రీనివాసరావుకు పార్టీ అధినేన చంద్రబాబు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పదోన్నతి కల్పించారు. ఆమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు వైసీపీ ప్రభు త్వంపై గత నాలుగున్నరేళ్లుగా ధైర్యంగా పోరాడడమే కాకుండా, దూకుడుగా ముందుకుపోతూ, పార్టీ ఇచ్చిన కార్యక్ర మాలను నిర్వహిస్తున్న ఆయనను పార్టీ గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించింది. జిల్లా నుంచి అనుక పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ చంద్రబాబు కనపర్తి వైపే మొగ్గు చూపారని ఆ మేరకు అచ్చెన్నాయుడికి ఆదేశాలు జారీ చేశారని తెలుస్తోంది. కాగా తనని ఆ పదవిలో నియమించిన చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు, నక్కా ఆనందబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

రోలింగ్ కారిడార్ బ్లాక్‌తో ఎనిమిది రైళ్ల రద్దు

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోలింగ్ కారిడార్ బ్లాక్ కారణంగా ఎనిమిది రైళ్లను రద్దు చేస్తున్నట్లు గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి మే 22వ తేదీ వరకు నెంబరు. 07783 విజయవాడ - గుంటూరు, నెంబరు 07788 గుంటూరు-విజయవాడ, నెంబరు. 07276 కాచీగూడ-మిర్యాలగూడ, నెంబరు. 07277 మిర్యాలగూడ - కాచీగూడ, ఈ నెల 30 నుంచి మే 23వరకు నెంబరు 07973 నడికుడి - మిర్యాలగూడ, నెంబరు. 07974 మిర్యాలగూడ - కాచీగూడ, మే 1నుంచి 31 వరకు నెంబరు. 07791 కాచీగూడ - నడికుడి, నెంబరు 07792 నడికుడి-కాచీగూడ రైళ్లను రద్దు చేస్తున్నామన్నారు. నెంబరు. 07779 గుంటూరు-మాచర్ల రైలుని ఈనెల 29 నుంచి మే22 వరకు గుంటూరు-నడికుడి మధ్యన రద్దు చేశామన్నారు. నెంబరు 07780 మాచర్ల-గుంటూరు రైలుని నడికుడి-గుంటూరు మధ్యన రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

గురజాల కేంద్రంగా జిల్లాను సాధిస్తా

● ఎన్నికల ప్రచారంలో యరపతినేనికి

● ఆరు గ్రామాల ఎన్నికల ప్రచారంలో బ్రహ్మరథం

మాచవరం, ఏప్రిల్ 25: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గురజాల కేంద్రంగా పల్నాడు జిల్లా సాధనకు కృషి చేస్తానని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గురువారం మాచవరం మండలంలోని కొత్తగణేశునిపాడు, పిల్లుట్ల, మల్లవోలు,శ్రీరుక్మిణీపురం, నాగేశ్వరపురంతండా, సింగరాయపాలెంతండా గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో యరపతినేని పర్యటనకు ప్రజల నుండి అపూర్వ ఘనస్వాగతం లభించింది. ముందుగా కొత్తగణేశునిపాడు గ్రామంలో పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో కొత్తగణేశునిపాడులో అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయాలను గుర్తుచేశారు. అలాగే అధికారంలోకి రాగానే అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు గెలిచి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు తిరిగి ప్రమాణం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగణేశునిపాడు గ్రామానికి చెందిన కొందరు పిల్లలు అమెరికా వెళ్లేందుకు ప్రయత్నాలు చేయగా వారిని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఇబ్బందులకు గురిచేశాడని ఆరోపించారు. గత ఐదు సంవత్సరాల నుండి పసుపుజెండా దించకుండా పోరాడుతున్న కార్యకర్తలు, నేతలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని, రానున్న రోజుల్లో ఇలాంటి వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

బీసీ ఎమ్మెల్సీలను అవమానించిన వైసీపీ...

బీసీ ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, ఏసురత్నంలను గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అవమానించారని, అది తట్టుకోలేకనే జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరారని యరపతినేని తెలిపారు. జంగా కృష్ణమూర్తిని బీసీ సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా చేసి ఐదేళ్లు పార్టీ కార్యక్రమాలకు వాడుకొని పార్టీ టిక్కెట్ ఇస్తానని నమ్మబలికి ఇవ్వకుండా బయటకు పంపారన్నారు. అలాగే కాసు నామినేషన్ సమయంలో గురజాల ఆర్డీవో కార్యాలయలోకి తీసుకెళ్లకుండా ఎమ్మెల్సీ ఏసురత్నంను అవమానించారన్నారు. వైసీపీలో బీసీలకు సముచిత న్యాయం, గౌరవం ఏదీ దక్కదన్నారు. టీడీపీలో బీసీలకు అన్నివిధాల సముచితస్థానం కల్పించి, ఉన్నతస్థానాల్లో నిలిపామన్నారు.

ముస్లింల అపూర్వ స్వాగతం ..

ఎన్నికల ప్రచారంలో భాగంగా పిల్లుట్ల గ్రామంలో యరపతినేని శ్రీనివాసరావుకు ముస్లింలు, మహిళలు చేతులలో కర్పూరం వెలిగించుకొని హారతులతో ఘనస్వాగతం పలికారు. 101 కొబ్బరికాయలు కొట్టి దిష్టి తీశారు.

ఈ ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షులు బడిగుంచల వెంకటేశ్వర్లు, పిడుగురాళ్ల జడ్పిటిసి జంగా వెంకట కోటయ్య, దున్నా చెన్నయ్య చౌదరి, పి. నరసింహారావు, బిక్షమయ్య, నరేంద్ర, శ్రీనివాసరావు, లఘుమవరపు శివపార్వతి సాంబశివరావు, కత్తి సరోజిని, ఎంపీటీసీ వీరస్వామి, ఖాజావలి, డి శ్రీనివాసరావు, ఎన్ శ్రీనివాసరావు, రాజు, ఆర్ శ్రీనివాసరావు, కామేశ్వర రావు, గోపాలరావు, రామయ్య, యడ్లపల్లి రామారావు, జే.వాసు పాల్గొన్నారు.

యరపతినేని సమక్షంలో టీడీపీలోకి చేరికలు ..

పిడుగురాళ్ల : మండలంలోని తుమ్మలచెరువులోని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన తుపాకుల సులోమాన్, ప్రకాష్, కాశయ్య, బైరపోగు కనకయ్య, పరదేశి, కరుణాకర్, మల్లయ్య, యశ్వంత్ మరికొన్ని కుటుంబాలకు చెందిన వారు గురువారం యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, వున్నం నరసింహారావు, వీర్ల కృష్ణమూర్తి, పార్టీ నాయకులు తదితరులున్నారు. గురజాల మండలం మాడుగుల, దాచేపల్లి పట్టణంలోని బీసీ యాదవ సామాజికవర్గానికి చెందిన బత్తుల గోవిందరాజు, మోటమోతుల గోవిందరాజు, చెన్నకేశవులు, వెంకట నారాయణ, నాగరాజు, మల్లిఖార్జున్‌తో పాటు మరికొన్ని కుటుంబాలకు చెందిన టీడీపీలో చేరారు.



ఎన్నికల ప్రచారంలో జూలకంటి బ్రహ్మారెడ్డి

పీడబ్ల్యూడీ కాలనీలో స్థానికులకే స్థలాలు

● మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి హామీ

మాచర్లటౌన్, ఏప్రిల్ 25: అనుచరులు, అనర్హులకు ఎమ్మెల్యే పీఆర్కే కట్టబెట్టిన స్థలాలను తిరిగి స్థానికంగా నివాసం ఉండే అర్హులకే అందిస్తామని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీతోపాటు 30, 31 వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఎన్నో యేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కాలనీలో నివసిస్తుంటే వారికి మొండిచేయి చూపి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వారి అనుచరులకు 4 నుంచి 5 సెంట్లు చొప్పున స్థలాలు అనధికారికంగా కేటాయించారన్నారు. ఆయా స్థలాల్లో ఇంటి నిర్మాణాలకు బదులు కమర్షియల్ కాంప్లెక్స్‌లు, బహుళ అంతస్థులు నిర్మించారన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే పీడబ్ల్యూడీ కాలనీని ప్రక్షాళన చేసి అక్రమంగా భవనాలు కట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత కలిగిన స్థానికులను గుర్తించి వారికే స్థలాలను కేటాయిస్తామన్నారు. కాలనీలో మౌలిక వసతులైన డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు, సీసీ రోడ్లు సదుపాయం కల్పిస్తామన్నారు. కూటమి అధికారంలోకి రాగానే అమలు చేయనున్న సూపర్ 6 పథకాలను వివరించారు. కార్యక్రమంలో యెనుముల కేశవరెడ్డి, కొండూరు లెనిన్‌బాబు, కొమ్ము సంతోష్‌కుమార్, యాగంటి మల్లికార్జునరావు, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, బొల్లెద్దుల ప్రకాష్, బాబు, గురవారెడ్డి, బొల్లెద్దుల లూకా, నక్షత్రపు ప్రసాద్, లాలు, ఓర్సు క్రాంతికుమార్, యేచూరి సురేష్, పోలిశెట్టి శ్రీనివాసరావు, దుర్గ్యాకుల ప్రసాద్, తిక్కా కొండలు, బొట్టు కోటేశ్వరరావు, బాదన్‌బాయి, నరసింహారావు పాల్గొన్నారు.

జన సందోహం

● కోలాహలంగా సత్తెనపల్లి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ నామినేషన్

● మండల గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

అమరావతి, ఏప్రిల్ 25: పెదకూరపాడు నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న భాష్యం ప్రవీణ్ గురువారం పెదకూరపాడులోని ఆర్వో కార్యాలయంలో నామినేషన్ వేసేందుకు అమరావతి అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి బయలు దేరారు. ప్రవీణ్‌కు సంఘీభావంగా ర్యాలీలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, శాసనమండలి మాజీ ఛైర్మన్ మహ్మద్ షరీఫ్, వంగవీటి రాధ, పిల్లి మాణిక్యరావు, జనసేన నేతలు బైనబోయిన శ్రీనివాసరావు. పల్నాడుజిల్లా బీజేపీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు పాల్గొన్నారు. నామినేషన్ కార్యాలయం వద్ద నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతిలో ర్యాలీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభం అయింది. మండల పరిధిలోని గ్రామాల నుండి వేలాదిగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ర్యాలీలో పాల్గొన్నారు.

కొందరు రైతులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో టీడీపీ, జనసేన, బీజేపీ, ఎంఆర్‌పీఎస్ జండాలు రెపరెపలాడాయి. దారిపొడవునా ర్యాలీ పసుపు మయంగా మారింది. భాష్యం ప్రవీణ్‌కు తెలుగు మహిళలు గుమ్మడి కాయలతో దిష్టి తీశారు.

పెదకూరపాడు నామినేషన్ కేంద్రం వద్దకు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి వచ్చిన ఉమ్మడి కూటమి పార్టీల శ్రేణులు చేరుకున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా నామినేషన్ కార్యక్రమం పూర్తయ్యే వరకు ఉండి తమ నాయకునికి అభినందనలు తెలియజేసి తమ గ్రామాలకు తిరిగి వెళ్లారు.



వంగవీటి రాధ, భాష్యం ప్రవీణ్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

అచ్చంపేట మండలం నుంచి భారీ ర్యాలీ..

అచ్చంపేట: భాష్యంప్రవీణ్ నామినేషన్ కార్యక్రమానికి అచ్చంపేట మండల గ్రామాల నుంచి వందలాది వాహనాలతో వేలాది మంది టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తరలి వెళ్ళారు. అచ్చంపేటలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మరో చోట కంచేటి సాయి ర్యాలీని ప్రారంభించారు. మండలం నుంచి సుమారు 10 వేల మంది టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు ప్రజలు తరలి వెళ్ళారు. బత్తుల శ్రీనివాసరావు, నల్లమేకల వెంకటేశ్వర్లు, వెనిగండ్ల కోటయ్య, పసుపులేటి పాపిరెడ్డి, పోట్ల శ్రీనివాసరావు, బాపిరాజు, ఎస్‌కే కాసుల, బుచ్చిబాబు, భాష్యం ప్రసాదు, కంచేటిసాయి తదితరుల ఆధ్వర్యంలో ప్రజలు భారీగా తరలివెళ్ళారు.



నామినేషన్ ర్యాలీలో సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రజలకు అభివాదం తెలుపుతున్న భాష్యం ప్రవీణ్ , పక్కన కొమ్మాలపాటి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మాదిగ హాజరు

భాష్యం ప్రవీణ్ నామినేషన్‌కు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ హాజరయ్యారు. ఆయతోపాటు నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలను ప్రవీణ్ నామినేషన్‌కు తరలించారు.

బెల్లంకొండ : మండలం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా భాష్యంప్రవీణ్ నామినేషన్ కు తరలివెళ్ళారు. టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్‌షరీఫ్ ఆధ్వర్యంలో చంద్రాజుపాలెం గ్రామం నుంచి మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు ఆధ్వర్యంలో, నాగిరెడ్డి పాలెం గ్రామం నుంచి మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డిల ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్ళారు. వాహన ర్యాలీని టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. మండలం నుంచి సుమారుగా 5 వేల మంది తరలి వెళ్ళినట్టు టీడీపీ నేతలు పేర్కొన్నారు.

400 కార్లు.. 1000 ద్విచక్రవాహనాలతో ర్యాలీ..

క్రోసూరు: భాష్యం ప్రవీణ్ నామినేషన్ కార్యక్రమానికి క్రోసూరు మండలం నుంచి సుమారు 400 జీపులు, 1000 ద్విచక్ర వాహనా లతో టీడీపీ కార్యకర్తలు తరలి వెళ్ళారు. దారి పొడవునా టీడీపీ అధికారంలోకి రావాలంటూ నినాదాలు, లావు శ్రీ కృష్ణ దేవరాయలు, బాష్యం ప్రవీణ్‌కు ఓటు వేయాలని కోరుతూ సైకిల్ గుర్తు పై ఓటు వేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీలో కార్యకర్తలు హోరెత్తించారు. భారీ ర్యాలీతో క్రోసూరు రోడ్లన్నీ పసుపు సైన్యంతో కిక్కిరిశాయి. ఈర్యాలీలో టీడీపీ మండల నేతలు నలజాల కోటేశ్వరరావు, కూరపాటి సైదా, షేక్ సలాం, మల్లాల రామాంజనేయులు, తోక వెంకటరావు, పిల్లకతుపుల రామయ్య, వై.విష్ణుమూర్తి, దాచేపల్లి చందు, అల్లరి సుధాకర్, కోలా సుబాష్ చంద్రబోసు, చందు, షేక్ బడా, ఖాశింసెట్టి రామారావు, వల్లాల వెంకటేశ్వరరావు, నాగవరం జాను, ఏపూరి నాగేశ్వరరావు, నీలం రామారావు, రామకోటేశ్వరరావు, గుడిపాడు బాషా, సదాశివరావు, పూర్ణ, కంచేటి నరసింహారావు, ఏడుకొం ~లు, తాళ్ళూరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి వెంకటరావు, బొబ్బా వెంకటేశ్వర్లు, కొండవీటి శ్రీనివాసరావు, వేగుంట రాణి, బోడెపూడి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగానే తరలివచ్చిన ప్రజలు..

● టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు

పెదకూరపాడు, ఏప్రిల్ 25: పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ నామినేషన్‌కు వేలాది మంది స్వచ్ఛందంగా తరలి వచ్చారని, వారికి ఎలాంటి మద్యం గాని, డబ్బు గాని ఇవ్వలేదని నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు అన్నారు. గురువారం ప్రవీణ్ నామినేషన్ కార్య క్రమంలో పాల్గొన్న శ్రీకృష్ణదేవరాయలు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రవీణ్ నామినేషన్‌కు వచ్చిన ప్రజలను చూస్తుంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమన్నారు. ప్రతి ఒక్కరు తప్పకుండా ఓటింగ్‌లో పాల్గొని ప్రవీణ్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా, నన్ను ఎంపీ అభ్యర్థులుగా సైకిల్ గుర్తులు పై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం స్థానిక నాగమల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వర ప్రసాదు, తండ్రి వెంకటరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ లావు, భాష్యం ప్రవీణ్

ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు ..

నియోజక వర్గంలోని అన్ని గ్రామాల నుంచి తన నామినేషన్‌కు వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు భాష్యం ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో ఓటింగ్‌లో పాల్గొని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు ఎంపీగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు.

గిరిజనులను మోసం చేసిన వైసీపీ

● టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

విజయపురిసౌత్, ఏప్రిల్ 25: వైసీపీ ప్రభుత్వం గిరిజనులను మోసంచేసిందని టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని చింతలతండా గ్రామంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూతవేటు దూరంలో కృష్ణానది ఉన్నప్పటికీ గిరిజన తండా వాసుల దాహార్తిని తీర్చలేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ బుద్ధి చెప్పాలన్నారు. మాచర్లలో కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో హనుమంత్‌నాయక్, వెంకటేశ్వర్లునాయక్, గుండ్లానాయక్, జబ్బార్‌నాయక్, శంకర్‌నాయక్, స్వామి నాయక్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

'జన సైనికులు గమనించాలి'

సత్తెనపల్లి, ఏప్రిల్ 25 : ఇప్పటి వరకు సత్తెనపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్తగా పనిచేసిన వ్యక్తి పార్టీకి రాజీనామా చేసి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారని, ఆయనకు పార్టీకి ఏ సంబంధంలేదన్న విషయాన్ని జన సైనికులు గమనించాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలోని జనసైనికులు ఎన్డీయే కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను బలపరిచి, ఆయన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌లో దాడి ఘటనపై కేసు

దాచేపల్లి, ఏప్రిల్ 25: దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తిపై దాడి ఘటనలో దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. బుధవారం రాత్రి మండలంలోని పొందుగల గ్రామానికి చెందిన తండా యూసుబ్ ఇంటి వద్ద జరిగిన ఘర్షణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చాడు. ఈ సంఘటనలో గ్రామ సర్పంచ్ తమ్ముడు షేక్ నాగుల, మరో నలుగురు వ్యక్తులు యూసుబ్‌పై దాడి చేశారు. అధికారం వుంది కదా అని వైసీపీ నేతలు ఇష్టానుసారంగా దుర్భాషలాడటం, స్టేషన్ పరిధిలోనే దాడిచేయడం వారి అహంకారానికి నిదర్శనమని టీడీపీ నేతలు ఆరోపించారు. స్టేషన్‌లోనే తనపై దాడిచేయడం, వారు ఏ స్థాయిలో అధికారం చెలాయిస్తున్నారో చెప్పకనే తెలుస్తుందని టీడీపీ మండల కన్వీనర్ భద్రి తదితరులు తెలిపారు.

పలువురు నామినేషన్లు..

పిడుగురాళ్ల, ఏప్రిల్ 25: గురజాల అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి ఏడవ రోజు చివరి రోజు అయిన గురువారం నామినేషన్ల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. టీడీపీ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తరుపున న్యాయవాది సూర్యరాజు, జానీబాష, ప్రభుదాసులు మరోసెట్ నామినేషన్‌ను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తియ్యగూర యలమందారెడ్డి రెండవ సెట్‌ను, నామినేషన్‌ను ఆర్‌ఓ రమణాకాంత్‌రెడ్డికి అందజేశారు. అఖిల భారతీయ జనసంఘ్ అభ్యర్థి నీరుమళ్ల శ్రీనివాసరావు రెండవ సెట్ నామినేషన్‌ను ఆర్‌ఓకు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా చీదెళ్ల వెంకట రవిబాబు, తాయ వెంకటేశ్వర్లు, గంగవరపు మల్లమ్మలు, రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ అభ్యర్థిగా షేక్ సైదావలి నామినేషన్ పత్రాలను అందజేశారు. మొత్తంగా 25 మంది అభ్యర్థులు 37 నామినేషన్లను ఎన్నికల అధికారి రమణాకాంత్ రెడ్డికి అందజేశారు.

సత్తెనపల్లి : సత్తెనపల్లి నియెజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తరుపున మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఎలినేడి రామస్వామి 4వ సెట్, కే.పద్మశ్రీ 3వ సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అలాగే స్వతంత్ర్య అభ్యర్థులుగా ఏ.హనుమంత రావు, గడ్డం రాంబాబు, పీ. రమేష్‌లు నామినేషన్‌లు దాఖలు చేశారు.

కన్నా, శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలి

నకరికల్లు, ఏప్రిల్ 25 : సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలని కన్నా తనయుడు కన్నా ఫణీంద్ర, లావు శ్రీకృష్ణదేవరాయలు సోదరి లావు రాణి రుద్రమదేవి, టీడీపీ నేత డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ నకరికల్లులో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశలను వివరిస్తూ ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. రుద్రమదేవి మహిళలకు బొట్టు పెట్టి మరీ ఓట్లను అభ్యర్థించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు నాదెండ్ల సత్యనారాయణ, టీడీపీ మహిళా నేతలు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: కన్నా లక్ష్మీనారాయణ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన తనయుడు, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు గురువారం పట్టణంలోని 11వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

● పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాదవ్

ఈపూరు,ఏప్రిల్25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాదవ్ చెప్పారు. మండలంలోని ఇనుమెళ్ళబొమ్మరాజుపల్లి, ఈపూరు, అంగలూరు, బొగ్గరం గ్రామాలలోని పోలింగ్ బూత్‌లను గురువారం ఎస్పీ పరిశీలించారు. బూత్‌లలోని వసతులను, వెబ్ కెమెరాల ఏర్పాటు గురించి అధికారులతో మాట్లాడారు. గ్రామాలలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు .గ్రామాల్లో అల్లర్లకు పాల్పడే వారిపై ఎలాంటి చర్యలు తీసుకునేందుకైన వెనుకాడబోమన్నారు.జిల్లాలో 587 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించామన్నారు.అదేవిదంగా 150 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 12వేల మందిని బైండోర్ చేసి కౌన్సిలింగ్ ఇస్తున్నామని ఎస్పీ తెలిపారు.



ఇనుమెళ్ళ గ్రామస్థులతో మాట్లాడుచున్న ఎస్పీ బిందుమాదవ్

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

గ్రామంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బిందుమాదవ్ అన్నారు. ఇనుమెళ్లలో టీడీపీ వారిపై వైసీపీ మూకలు చేసిన దాడిచేసిన నేపథ్యంలో గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఆ గ్రామాన్ని ఎస్పీ బిందుమాదవ్ గురువారం సందర్శించి పరిసితులను అడిగి తెలుసుకున్నారు.



సత్తెనపల్లి ఎన్నికల ప్రచార ర్యాలీలో మాట్లాడుతున్న షర్మిల

వైసీపీ రైతులను దగా చేసింది

● పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

● ప్రాజెక్టులను గాలికొదిలేసిన మంత్రి ఆంబోతు రాంబాబు

● అధికారంలోకి రాగానే రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా

సత్తెనపల్లి ఏప్రిల్ 25: వైసీపీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయయం వద్ద ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో న్యాయ యాత్రసభ నిర్వహించారు. ఈ సభలో షర్మిల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారాన్ని చెల్లించలేదన్నారు. పంటరుణాలను ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. నాగార్జున సాగర్ కాల్వల మరమ్మతులను చేయించకుండా గాలికొదిలేసిందన్నారు. రాష్ట్రానికి రాజధానిని లేకుండా చేసిందని దుయ్యబట్టారు. మూడు రాజధానులంటూ ఏ ఒక్క రాజధానిని నిర్మించలేదన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేసినది ఏదీ లేకపోగా, లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ మంత్రి అంబటి రాంబాబు కాదని ఆంబోతు రాంబాబు అని అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రాజెక్టులు నిర్మాణం చేస్తే ఈ ప్రభుత్వం ఈ మంత్రి ప్రాజెక్టుల అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ప్రాజెక్టులకు గేటులు రిపేరు చేయించలేని స్థితిలో నీటిపారుదల శాఖ మంత్రి అంబటి ఉన్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో మైనింగ్, గ్రావెల్ మాఫియా ఇసుక మాఫియా యదేచ్ఛగా సాగుతుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కేంద్రలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. మహిళలకు సంవత్సరానికి రూ. 1లక్ష అందిస్తామన్నారు. రానున్న ఎన్నికలలో హస్తం గుర్తుపై ఓటువేసి సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి చుక్కా చంద్రపాల్, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అలగ్జాండర్ సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజుపాల్, సీపీఎం, సీపీఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు షర్మిలకు ఘన స్వాగతం పలికారు.



బ్రహ్మణపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో కన్నా లక్ష్మీనారాయణ

గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తా

● ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గ ఎన్డీఏ అభ్యర్థి కన్నా

రాజుపాలెం,ఏప్రిల్25: 'మీ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించి, మీరు ఆర్థికంగా ఉన్నతస్థితిలో ఉండేలా కృషి చేస్తా'నని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. గురువారం మండలంలోని బ్రహ్మణపల్లి, ఆకులగణపవరం గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా గ్రామాలలోని ప్రధాన రహదారులలో తిరిగి కరపత్రాలను ప్రజలకు అందజేసి మేనిఫెస్టో గురించి తెలియజేస్తూ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న తనకు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా ఉన్న లావు శ్రీకృష్ణదేవరాయులను బలపరచాలని, సైకిల్ గుర్తుపై రెండు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన తిరిగివచ్చి అందరూ సంతోషంగా, ఆనందంగా జీవించాలంటే రానున్న ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. అమరావతి రాజధానిగా కొనసాగాలి అన్న, యువతకు ఉపాధి అవకాశాలు రావాలన్నా, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలన్నా, మన ప్రాంతంతో పాటు రైతులు అభివృద్ధి చెందాలంటే గోదావరి-కృష్ణ-పెన్నా నదుల అనుసంధాన పనులు రూ6200కోట్లు ప్రాజెక్టు త్వరితగతిన పూర్తిచేస్తానని, కొండమోడు-పేరేచర్ల రోడ్డు 4 లైన్లుగా విస్తరించి రోడ్డు ప్రమాదాల నివరణకు కృషి చేస్తానని హమీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు తోట నరసయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొచ్చెర్లలో ప్రచారంలో మాట్లాడుచున్న జీవీ ఆంజనేయులు, పక్కన శ్రీకృష్ణదేవరాయలు

మాఫియా పాలన నుంచి విముక్తి

● లావు శ్రీకృష్ణదేవరాయలు, జీవీ ఆంజనేయులు

ఈపూరు,ఏప్రిల్ 25: ఇసుక, మద్యం మాఫియా నుండి విముక్తి కోసం వినుకొండ నియోజక వర్గం ప్రజలు మరో మూడు వారాలు ఓపిక పట్టాలని జీవీ ఆంజనేయులు, లావుశ్రీకృష్ణదేవరాయులు అన్నారు. మండలంలోని కొచ్చెర్ల, ఈపూరు, ముప్పాళ్ళ, పొనుగోటివారిపాలెం, గోపువారిపాలెం గ్రామాలలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ,లావు మాట్లాడుతూ భూకబ్జాలు, అక్రమ రేషన్‌బియ్యం రవాణా చేసి వేలకోట్లను దోచుకున్న బొల్లా బ్రహ్మనాయుడును చిత్తుగా ఓడించేందుకు ప్రతి ఒక్కరు కంకణం కట్టుకోవాలన్నారు. ఇంటింటికి తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తే అందించే సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల గురించి వివరించారు. రైతులకు కనీసం రెండు పంటలకు సాగునీటిని అందించేందుకు గోదావరి జలాలను అనుసందానం చేస్తామని ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండలపార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య,ఐనాల కోటేశ్వరరావు,గోలి అప్పారావు,కూరాకుల,శ్రీనివాసరావు,నిశ్శంకరరావు అంకారావు, నరసింహారావు,,చంద్రరావు,సుబ్బారావు,ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాల్లో ఐజీ పర్యటన

రెంటచింతల,ఏప్రిల్ 25 : మండలంలోని రెంటాల గ్రామాన్ని రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి గురువారం సందర్శించారు. గ్రామంలోని 239, 240, 241, 242 పోలింగ్ బూత్‌లను పరిశీలించి వెబ్‌కాస్టింగ్ పనితీరు, సమస్యాత్మక గ్రామాలెన్ని, తీసుకుంటున్న చర్యల గురించి గురజాల డీఎస్పీ పల్లపురాజుని అడిగి తెలుసుకున్నారు. 68 సమస్యాత్మక గ్రామాలనీ, ఇప్పటి వరకు 2995 మందిపై బైండోవర్ కేసులు పెట్టామని డీఎస్పీ తెలిపారు. ఓటర్లల్లో పూర్తిగా మనో ధైర్యం కల్పించాల్సిన అవసరాన్ని ఐజీ ప్రత్యేకంగా చెప్పారు. అనంతరం మంచికల్లు వెళ్లి గ్రామస్థులతో మాట్లాడడంతో పాటు పోలింగ్ బూత్‌లను కూడా పరిశీలించారు. ఈ నెల 23న ఎస్పీ బింధుమాధవ్ రెంటాల రావడం, రెండు రోజుల వ్యవధిలో ఐజీ త్రిపాఠి రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఓ పార్టీకి చెందిన వారికి ఎన్నికల సమయంలో రక్షణ కల్పించడం లేదని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, ఎన్నికల కమిషన్‌కు బరిలో ఉన్న అభ్యర్థి ఫిర్యాదు చేయడంతో పోలీసుల రాకపోకలు పెరగడంతో పాటు ఎన్నడూ లేని విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం గమనార్హం. రెంటాలలో ప్రస్తుత పరిస్థితుల గురించి ప్రశ్నించగా.. ఇటీవలే బదిలీపై వచ్చిన ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి సమాధానమిస్తూ గ్రామంలో పోలింగ్ శాతం అధికంగా ఉంటుందని, మరణలతే లేవని వివరించారు.



బెల్లంకొండలో వైసీపీ మూకలు దగ్ధం చేసిన టీడీపీ కార్యాలయం (ఫైల్)

• ఎన్నికల రహదారా..
• పట్టించుకోని అధికారులు

రోడ్డుపై మళ్లీ రోడ్డు !

పిడుగురాళ్ల, ఏప్రిల్ 25: ఎన్నికల వేళ అధికార రాజకీయ పార్టీలలో ఓట్ల గుబులు మొదలైంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎన్నాళ్ల నుంచో అడుగుతున్న పనులకు ఇప్పుడు మోక్షం కలుగుతుంది. పిడుగురాళ్లలోని మొండిగేటుకు వెళ్లే రహదారి గతుకుల మయమైందని, సిమెంట్ రోడ్డు వేయాలంటూ ఆ వీధిలోని వారు పలుమార్లు అధికారులను అడిగినప్పటికీ నిధుల కొరతతో పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం ఇప్పుడు రహదారిపై వున్న గతుకులను పూడ్చాల్సింది పోయి ఏకంగా రోడ్డుపైనే గురువారం రోడ్డు వేశారు. రోడ్డు వేసింది అధికారులా... రాజకీయ నాయకులా.. అనేది తేలాల్సి వుంది. ఏది ఏమైనప్పటికీ ఓట్ల కోసం అధికార పార్టీ చేస్తున్న కొన్నింటికి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నారు.



మొండిగేటు వైపు వెళ్లే రహదారికి సిమెంట్ వేయకముందు ఇలా...



మొండిగేటు వైపు వెళ్లే రహదారిపై వేసిన రోడ్డుపై మళ్లీ సిమెంట్ వేసిన తరువాత ఇలా..

జిల్లాలో 342 నామినేషన్లు

• లోక్‌సభకు 40.. అసెంబ్లీలకు 302 దాఖలు
• ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ ప్రక్రియ

నరసరావుపేట, ఏప్రిల్ 25: జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. చివరిరోజు గురువారం 89 నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థుల ర్యాలీలతో నామినేషన్ల ఘట్టం కోలాహలంగా జరిగింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సందర్భంగా పోటాపోటీగా ర్యాలీలు నిర్వహించారు. నామినేషన్ల స్క్రూటినీ శుక్రవారం నిర్వహించనున్నారు. నరసరావుపేట లోక్‌సభ స్థానానికి 27 మంది అభ్యర్థులు 40 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 176 మంది అభ్యర్థులు 302 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. చిలకలూరిపేటలో అత్యధికంగా 33 మంది, సత్తెనపల్లిలో అతి తక్కువగా 22 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

నియోజకవర్గాల వారీగా నామినేషన్‌ల వివరాలు..

నియోజకవర్గం	అభ్యర్థుల సంఖ్య	నామినేషన్‌లు
నరసరావుపేట లోక్‌సభ	27	40
నరసరావుపేట అసెంబ్లీ	25	48
పెదకూరపాడు	26	51
చిలకలూరిపేట	33	49
సత్తెనపల్లి	22	38
వినుకొండ	24	39
గురజాల	25	37
మాచర్ల	24	40

కోడ్ ఉన్నా..

యథేచ్ఛగా దాడులు

• పెట్రేగిపోతున్న వైసీపీ మూకలు
• మారని అధికారుల తీరు.. ఆగని అరాచకాలు
• స్టేషన్‌లో పోలీసుల సమక్షంలోనే దాడులకు యత్నం
• టీడీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్న వైసీపీ
• ప్రశాంత, స్వేచ్ఛాయుత ఎన్నికలపై ఓటర్లలో సన్నగిల్లుతున్న నమ్మకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. అందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పిస్తున్నాం. ఏ నిమిషంలో ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందిస్తున్నాం. కేసులు నమోదు చేస్తున్నాం.. అని కలెక్టర్ శివశంకర్, ఎస్పీ బిందుమాధవ్ గత కొన్ని రోజులుగా ప్రకటిస్తున్నారు.. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా గత కొన్ని రోజులుగా వరుసగా జరుగుతున్న అరాచక సంఘటనలను చూసిన వారు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోగలమా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు ఎస్పీగా రవిశంకర్‌రెడ్డి బదిలీతో అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న పోలీసులు, ఇతర ఎన్నికల అధికారులు వెనక్కి తగ్గుతారని అందరూ భావించారు. అయితే మా ధోరణి మాదే అన్నట్లుగా ఇంకా కొందరు పోలీసు అధికారులు ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికార పార్టీ శ్రేణులు తగ్గేదేలే అన్న రీతిలో అరాచకాలకు పాల్పడుతూనే ఉన్నాయి. తమ మాట వినని వారిపై దాడులకు తెగబడుతున్నాయి. వీటికి హద్దే లేకుండా పోయింది. వైసీపీ మూకలు పేట్రేగిపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ఇదే అవకాశంగా టీడీపీ సానుభూతి పరులను టార్గెట్ చేస్తున్నారు. కొందరు పోలీసు అధికారులు వ్యవహరిస్తున్న తీరు ప్రశాంత ఎన్నికలపై ఓటర్లలో నమ్మకం సన్నగిల్లుతోంది. ఎస్పీ బిందు మాధవ్ జిల్లాలో ప్రశాంత ఎన్నికల కోసం విస్తృతంగా చర్యలు తీసుకుంటున్నా అదే స్థాయిలో కింది స్థాయి అధికారులు వ్యవహరించడంలేదన్న విమర్శలున్నాయి.

ప్రజల్లో భయాందోళనలు

జిల్లాలో వరుసగా జరుగుతున్న దాడులతో సామాన్య ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మాచర్ల, గురజాల నియోజకవర్గం నుంచి ఇతర నియోజకవర్గాలకు అరాచకాలు ప్రబలుతున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత పెదకూరపాడు, వినుకొండ, నరసరావుపేట నియోజకవర్గాల్లో కూడా పలు సంఘటలు చోటుచేసుకున్నాయి. ఫిర్యాదు ఇస్తే ఐదే ఐదు నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా ఆచరణలో అది కనిపించడంలేదు. దాడులు పథకం ప్రకారం జరగడంలేదని, అప్పటికప్పుడు చోటు చేసుకుంటున్నాయని అధికారులు ప్రకటించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జరిగిన అరాచకాలను పరిశీలిస్తే క్షణికావేశంలో జరిగినట్లుగా కానరావడంలేదు. పథకం ప్రకారమే టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తలపై దాడుల జరుగుతున్నట్లు అర్థమవుతుంది. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన టీడీపీ వర్గీయులపై ఏకంగా పోలీసు స్టేషన్‌లోనే పోలీసుల సమక్షంలో వైసీపీ మూకలు దాడి చేశాయంటే వారి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. వారికి పోలీసులు అండ ఎంత ఉందో అర్థమవుతుంది. మాచర్ల, గురజాల, పెదకూరపాడు, వినుకొండ, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఈ వారం పది రోజుల్లో దాదాపు 20కి పైగా సంఘటనలు జరిగాయి. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలు చూస్తే..

- దాచేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లిన టీడీపీ కార్యకర్త యూసఫ్‌పై పోలీసుల సమక్షంలో దాడి జరిగింది.
- ఈపూరు మండలం ఇనుమెళ్లలో టీడీపీ సానుభూతిపరుల ఇళ్లపై వైసీపీ మూకలు రాళ్లతో దాడిచేసి ముగ్గురిని తీవ్రంగా గాయపరిచాయి. టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు నామినేషన్ కార్యక్రమానికి వెళ్లి వచ్చిన అనంతరం వైసీపీ మూకలు ఈ దాడికి తెగబడ్డాయి.
- నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామంలో టీడీపీ అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఎన్నికల ప్రచారాన్ని వైసీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. ప్రచార వాహనం వద్ద కర్రలతో హల్‌చల్ చేస్తూ దాడికి యత్నించాయి. ఈ సంఘటన పోలీసుల సమక్షంలోనే జరగడం గమనార్హం.
- బెల్లంకొండ మండలంలో టీడీపీ కార్యాలయాన్ని ఆగంతకులు దహనం చేశారు. ఇది వైసీపీ వారి పనేనని టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ కళాజాత ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. వాహనానికున్న ఫ్లెక్సీలను చించివేసి కళాకారులపై దాడిచేసి గాయపరిచారు.



నరసరావుపేట: ఉప్పలపాడులో ఇటీవల టీడీపీ అభ్యర్థుల ప్రచారాన్ని అడ్డుకుని హల్‌చల్ చేస్తున్న వైసీపీ మూకలు



దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లోనే టీడీపీ కార్యకర్త తండా యూసుఫ్‌ను గాయపర్చిన పొందుగులకు చెందిన వైసీపీ మూకలు (ఫైల్)



పెదకూరపాడు: టీడీపీ ప్రచార వాహనం ఫ్లెక్సీలను చించిన వైసీపీ మూకలు, వారి దాడిలో గాయపడిన కళాకారులు(ఫైల్)



ఈపూరు మండలం ఇనిమెళ్లలో వైసీపీ మూకల దాడిలో గాయపడిన క్షతగాత్రులు

రాజకీయాలకు.. పాఠశాల

• నిడుబ్రోలులో తొలిసారిగా ఏర్పాటు
• మహాత్మా గాంధీ చేతుల మీదుగా ప్రారంభం
• ముఖ్యమంత్రులు, మంత్రులును అందించిన పాఠశాల

పొన్నూరుటౌన్, ఏప్రిల్25: గ్రామీణ ప్రాంత ప్రజలు అన్ని రంగాలతో పాటు రాజకీయ రంగంలో కూడా రాణించాలన్న ఉద్దేశంతో నిడుబ్రోలులో రామనీడు రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేశారు. రాజకీయ దురంధరుడిగా పేరుగాంచిన ఆచార్య ఎన్జీరంగా 1932లో గుంటూరు జిల్లా పొన్నూరు సమీపంలోని నిడుబ్రోలులో రామనీడు గ్రామీణ రైంతాంగ విద్యాలయాన్ని మహాత్మగాంధీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ పాఠశాలలో ఎందరికో రాజకీయ ఓనమాలు దిద్దించారు. ఈ పాఠశాలకు దేశం నలుమూలల నుంచి ఉత్తములను ఎంపిక చేసి వారిని రాజకీయ పాఠాలు నేర్పించేందుకు నియమించారు. 1932లో స్వామి సీతరామ్‌ను చూసేందుకు కావూరు వినయాశ్రమానికి వచ్చిన మహాత్మగాంధీ చేత ఈ పాఠశాలను ప్రారంభించారు. పల్లె వాసులు కూడా రాజకీయ ఆర్థిక, కార్మిక వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో ఎదిగేలా ఈ పాఠశాలను తీర్చిదిద్దారు. అలాగే స్వతంత్ర ఉద్యమంలో పల్లెవాసులకు ప్రాతినిధ్య వహించేలా ఈ పాఠశాల తర్ఫీదు ఇచ్చేది. అయితే ఈ పాఠశాల రాజకీయ పాఠశాలగా కాలక్రమంలో రూపాంతం చెంది దేశానికి ముఖ్యమంత్రులను, మంత్రులను అందచేసింది. ఆచార్య ఎన్జీ రంగా శిష్యులుగా పేరొందిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, కొణిజేటి రోశయ్య, ఆర్ఎం సింగ్ దేవ్ (ఒరిస్సా), చిమన్‌భాయ్ పటేల్ (గుజరాత్), అన్నదురై (తమిళనాడు), దామోదరం సంజీవయ్య, బెజవాడ గోపాల్‌రెడ్డి, భవనం వెంకట రామిరెడ్డి తదితరులు ఈ పాఠశాలలోనే రాజకీయ ఓనమాలు దిద్ది ముఖ్య మంత్రులుగా పరిపాలించారు. అలాగే సర్దార్ గౌతుల చ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, రాజగోపాల్ నాయుడు, వీరాచారి, జీయ్యర్‌దాస్, అనగాని భగవంతరావు, యడ్లపాటి వెంకట్రావు, గోవాడ పరందామయ్య, అవుతు రామిరెడ్డి తదితరులు మంత్రులుగాను, ఎంపీలు, ఎమ్మెలుగా పనిచేశారు. ఈ పాఠశాల కాలక్రమంలో శిథిలం కావటంతో పూర్తి తొలగించారు.



రామనీడు రాజకీయ పాఠశాల (ఫైల్)

ఎన్నికల పరిశీలకుల రాక

• సమస్యలుంటే 9154690367 నెంబర్ కాల్ చేయాలని సూచన

నరసరావుపేట, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా జిల్లాకు ఎన్నికల పరిశీలకులను నియమించింది. పరిశీలకులు గురువారం జిల్లా వచ్చారు. పెదకూరపాడు, సత్తెనపల్లి, గురజాల మరియు మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన బూరె సర్వేశ్వరుడు నరేంద్ర కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంబంధించి సమస్యల నివారణకు రోజు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 91546 90367 నెంబర్‌లో అందుబాటులో ఉంటానని ఆ సమయంలో ఎవరైనా ఫోన్ చేసి సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చు అని ఆయన తెలిపారు. కాగా జిల్లాకు ఎన్నికల పోలీసు పరిశీలకులుగా నియమితులై డీఐజీ డాక్టర్ అజిత్ సింగ్ జిల్లాకు వచ్చారు. ఈసందర్భంగా నరసరావుపేట మునిసిపల్ గెస్ట్‌హౌస్‌లో అజిత్‌సింగ్‌ను జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మర్యాదపూ ర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేశారు.



ఎన్నికల పోలీసు శాఖ పరిశీలకుడు డీఐజీ డాక్టర్ అజిత్ సింగ్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎస్పీ బిందు మాధవ్



కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగాలను పరిశీలిస్తున్న పరిశీలకుడు బూరె సర్వేశ్వరుడు నరేంద్ర

చట్టసభల్లో..

నారీభేరి

• కేంద్ర మంత్రులుగా ఇద్దరు.. రాష్ట్ర మంత్రులుగా ఐదుగురు
• హ్యాట్రిక్ సాధించిన ఇద్దరు
• పలువురు ఎమ్మెల్యేలుగా ఎన్నిక

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జనాభా.. ఓటర్లలోనూ వారే అధికం. చట్టసభల్లో ప్రాతినిధ్యానికి వచ్చేసరికి చాలా తక్కువ సంఖ్యలో ఉంటున్నారు. మహిళలకు ప్రధానంగా ఆయా రాజకీయపక్షాలు అవకాశాలు కల్పించడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు కేంద్ర మంత్రులుగా, ఐదుగురు రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు నిర్వహించారు. ఇద్దరు తమ నియోజకవర్గాల్లో హ్యాట్రిక్ సాధించారు. అవకాశాలు కల్పిస్తే దూసుకు పోతామని రుజువు చేస్తున్నారు. అయినా కొన్ని పార్టీలు వారికి సముచిత స్థానం కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

జిల్లా నుంచి లోక్‌సభకు ఎన్నికై కేంద్ర మంత్రులుగా దగ్గుబాటి పురంధేశ్వరి, పనబాక లక్ష్మి బాధ్యతలు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురంధేశ్వరి 2004లో బాపట్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆమె యూపీఏ ప్రభుత్వంలో సహాయ మంత్రిగా పనిచేశారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో బాపట్ల లోక్‌సభ స్థానం ఎస్సీలకు కేటాయించారు. దీనితో పురంధేశ్వరి 2009లో విశాఖపట్నానికి మారారు. నెల్లూరు జిల్లాకు చెందిన పనబాక లక్ష్మి 2009లో బాపట్ల నుంచి లోక్‌సభకు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఆమె 2009-14లో కేంద్రమంత్రిగా పనిచేశారు. విభజన తరువాత 2014లో ఆమె ఇక్కడ ఓడిపోయారు. కాగా సినీనటి ఊర్వశి శారద తెనాలి నుంచి లోక్‌సభకు 1996లో టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. 1998లో అక్కడే ఓడిపోయారు. తరువాత 1999లో నెల్లూరు జిల్లా వెంకటగిరి అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తరువాత కాంగ్రెస్‌లో చేరారు.

రాష్ట్ర మంత్రులుగా..

ఉమ్మడి అంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాకు చెందిన నలుగురు మహిళలు అసెంబ్లీకి ఎన్నికై మంత్రులుగా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం మరొకరు శాసనసభకు ఎన్నికై మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భవనం జయప్రద, నన్నపనేని రాజకుమారి, ఈపూరి సీతారావమ్మ, డాక్టర్ శనక్కాయల అరుణలు మంత్రులుగా పని చేశారు. న్యాయవాది భవనం జయప్రద వినుకొండ నుంచి రెండుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

- మాజీ సీఎం దివంగత భవనం వెంకట్రామ్ సతీమణి జయప్రద ఆయన కంటే ముందు నుంచే రాజకీయాల్లో ఉన్నారు. 1967-78లో పదేళ్లపాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. అప్పట్లోనే రాష్ట్రమంత్రిగా పనిచేశారు. కోస్తా జిల్లాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు.
- తెనాలికి చెందిన నన్నపనేని రాజకుమారి 1983లో సత్తెనపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా, 1989లో వినుకొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. సత్తెనపల్లి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నాదెండ్ల క్యాబినెట్‌లో నెలరోజుల మంత్రిగా పనిచేశారు. వినుకొండ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అసెంబ్లీ చీఫ్‌విప్‌గా కొనసాగారు. 1994లో వినుకొండ నుంచి ఓడిపోయారు. తరువాత టీడీపీలో చేరారు. నన్నపనేని ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం, కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారు. విభజన తరువాత నవ్యాంధ్ర మహిళా కమిషన్ తొలి ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించారు.
- 2009 నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఉన్న కూచినపూడి నుంచి ఈపూరి సీతారావమ్మ వరుసగా మూడుసార్లు శాసనసభకు ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఆమె 1985, 1989, 1994లో అసెంబ్లీకి కూచినపూడి నుంచి గెలుపొందారు. 1999లో ఓడిపోయారు. 1995-99లో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు మంత్రివర్గంలో పనిచేశారు. ఓడిపోయిన తరువాత రాజకీయాలకు దూరంగా ఉన్నారు.
- గుంటూరు నగరానికి చెందిన వైద్యురాలు శనక్కాయల అరుణ 1999లో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. టీడీపీ అభ్యర్థిగా గుంటూరు-2 నుంచి గెలుపొందిన డాక్టర్ అరుణ చంద్రబాబు క్యాబినెట్‌లో వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా సుమారు రెండేళ్లు కొనసాగారు.
- పల్నాడులో మాచర్ల నుంచి 1999లో జూలకంటి దుర్గాంబ టీడీపీ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. పల్నాడు నుంచి చట్టసభలకు ఎన్నికైన తొలి మహిళగా దుర్గాంబ రికార్డు సృష్టించారు.
- చిలకలూరిపేటలో రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన డాక్టర్ కందిమళ్ల జయమ్మ 1989లో టీడీపీ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1994లో ఆమెకు టికెట్ రాలేదు. 1995లో చిలకలూరిపేట మున్సిపల్ ఛైర్మన్‌గా జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.
- గుంటూరుకు చెందిన జైమున్నీసా బేగం 1972లో పెదకూరపాడు నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మైనార్టీలు ఎక్కువగా ఉన్నారని ఒక వర్గం జైమున్నీసా బేగాన్ని రంగంలోకి దింపి గెలిపించారు. తరువాత ఆమె రాజకీయాలకు దూరమయ్యారు.
- చేనేతలు ఎక్కువగా ఉన్న మంగళగిరిలో 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా కాండ్రు కమల అసెంబ్లీకి ఎన్నికయ్యారు. విభజన తరువాత 2014లో ఆమె పోటీ చేయలేదు. 2000లో మంగళగిరి మున్సిపల్ ఛైర్మన్‌గా ప్రత్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు.
- తెనాలి నుంచి దివంగత దొడ్డపనేని ఇందిర ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీకి హ్యాట్రిక్ సాధించారు. ఆమె 1967, 1972, 1978లో వరుసగా మూడుసార్లు తెనాలి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 1983, 1985లో ఓడిపోయారు. ఆమె తండ్రి దివంగత ఆలపాటి వెంకటరామయ్య తెనాలి నుంచి గెలుపొంది రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.
- తెలుగుదేశం పార్టీ 1999లో తెనాలిలో డాక్టర్ గోగినేని ఉమను బరిలోకి దింపారు. ఆ ఎన్నికల్లో డాక్టర్ ఉమ కాకలు తీరిన కాంగ్రెస్ నేత రోశయ్యను ఓడించారు. 2004లో డాక్టర్ ఉమ ఓడిపోయారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత 2009లో టీడీపీ ఆమెకు టికెట్ ఇవ్వలేదు. ఉమ తల్లి ఇందిర, తాత వెంకటరామయ్యలు కూడా తెనాలి నుంచి ఎమ్మెల్యేలుగా పనిచేశారు.
- ప్రత్తిపాడు నుంచి మేకతోటి సుచరిత 2009లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ మృతి తరువాత సుచరిత జగన్‌వైపు మొగ్గారు. అసెంబ్లీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో పదవి కోల్పోయారు. తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. 2019లో తిరిగి గెలుపొందారు. ఈ దఫా నియోజకవర్గం మారి తాడికొండ నుంచి పోటీ చేస్తున్నారు. చిలకలూరిపేట నుంచి గత ఎన్నికల్లో గెలుపొందిన విడదల రజని జగన్ మంత్రివర్గంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ విధంగా జిల్లాలో పలువురు మహిళలు చట్టసభలకు ఎన్నికయ్యారు.







పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బాధితుడికి జీవీ ఆంజనేయులు పరామర్శ


గాయపడిన సురేష్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 25: వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తిని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జీవీ ఆంజనేయులు గురువారం పరామర్శించారు. బుధవారం వినుకొండలో జీవీ ఆంజనేయులు నామినేషన్‌కు వెళ్లి వస్తున్న సురభి సురేష్‌పై మండలంలోని నాగులువరంలో ద్విచక్రవాహనంపై ఉన్న జెండాలను తొలగించి ఆయనపై తీవ్రంగా దాడిచేశారు. దాడిలో గాయపడిన సురేష్‌ను గ్రామస్థులు వినుకొండ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న జీవీ ఆంజనేయులు గురువారం సురేష్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జీవీ మాట్లాడుతూ అధికారం అడ్డంపెట్టుకొని టీడీపీ కార్యకర్తలపై చేస్తున్న దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంస్కారం నేర్పారని, క్రమశిక్షణగా ఉన్న పార్టీ కార్యకర్తలపై వైసీపీ అల్లరిమూకలు దాడిచేయడం అమానుషమన్నారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దాడులకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. నామినేషన్‌కు వెళ్లారనే అక్కసుతో వ్యక్తిపై దాడిచేయటం అమానుషమన్నారు. జీవీతోపాటు పార్టీ మండల అధ్యక్షుడు మాదినేని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు: ఎస్పీ

ఇనుమెళ్ళ (ఈపూరు) ఏప్రిల్ 25: గ్రామంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాదవ్ అన్నారు. ఇనుమెళ్లలో టీడీపీ వారిపై వైసీపీ మూకలు చేసిన దాడిచేసిన నేపథ్యంలో గ్రామంలో పోలీస్ పికెటింగ్ పెట్టారు. గ్రామాన్ని ఎస్పీ బిందుమాదవ్ గురువారం సందర్శించి పరిస్థితులను అడిగితెలుసుకున్నారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదన్నారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్పీతో పాటు వినుకొండ రూరల్ సీఐ సుధాకర్‌రావు,ఎస్ఐ ఎస్కే మహమ్మద్ ఫిరోజ్ ఉన్నారు.

రేపు పాలిసెట్ 2024

నాదెండ్ల, ఏప్రిల్ 25 : నాదెండ్ల, ప్రభుత్వ, ప్రైవేట్ పాలిశెట్ కళాశాలతో పాటు ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సుల ప్రవేశానికి నిర్వహించే పాలిశెట్ ఎంట్రెన్స్ 2024 పరీక్ష శనివారం జరుగుతుందని చిలకలూరిపేట పాలిసెట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంఎం డేవిడ్ రాజు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంట గంట వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. పల్నాడు జిల్లాలోని మాచర్ల, చిలకలూరిపేట ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. గణపవరంలోని సీఆర్ కళాశాలతో పాటు చిలకలూరిపేట పట్టణంలోని ఆరు కేంద్రాల్లో మొత్తం 2049 మంది పరీక్ష రాయనున్నారన్నారు. చిలకలూరిపేట పట్టణంలో ఏఎంజీ జూనియర్ కళాశాల, శారదా జెడ్పీ ఉన్నత పాఠశాల, సెయింట్ చార్లెస్, జీఆర్ జూనియర్ కళాశాల, మోడరన్ గ్రీన్ వ్యాలీ పాఠశాలలో ఈ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ రిజిస్టేసన్ నెంబరు గల కలిగి సాంకేతిక కారణాల వల్ల హాల్ టిక్కెట్ పొందలేని వారు 27వ తేదీ ఉదయం 9 గంటలకు మోడరన్ గ్రీన్ వ్యాలీ పరీక్షా కేంద్రానికి వచ్చి డూప్లికేట్ హాల్ టిక్కెట్ పొంద వచ్చన్నారు. దీని కోసం పాలిసెట్ దరఖాస్తు చేసిన రిజిస్ట్రేషన్ ఫారం, 10వ తరగతి హాల్ టిక్కెట్, ఆధార్ కార్డుతో పాస్ ఫోర్టు జత చేసి పరీక్షా రుసుం చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ 100, ఇతరులకు రూ 400 చెల్లించి డూప్లికేట్ హాల్ టిక్కెట్‌ను పొంద వచ్చన్నారు. పరీక్షా హాల్‌లోకి 9:45 గంటల నుంచే అనుమతిస్తారన్నారు. 11 గంటల తరువాత లోనికి ఎవ్వరినీ అనుమతించరని ఆయన తెలిపారు.


కొచ్చెర్లలో జరిగిన ప్రచారంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు

ఇసుక, మద్యం మాఫియా నుంచి విముక్తి

● జీవీ ఆంజనేయులు

ఈపూరు, ఏప్రిల్ 25: ఇసుక, మద్యం మాఫియా నుండి విముక్తి కోసం వినుకొండ నియోజకవర్గ ప్రజలు మరో మూడు వారాలు ఓపిక పట్టాలని జీవీ ఆంజనేయులు, లావు శ్రీకృష్ణదేవరాయులు అన్నారు. మండలంలోని కొచ్చెర్ల, ఈపూరు, ముప్పాళ్ళ, పొనుగోటివారిపాలెం, గోపువారిపాలెం గ్రామాలలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ, లావు మాట్లాడుతూ భూకబ్జాలు, అక్రమ రేషన్‌బియ్యం రవాణా చేసి వేలకోట్లను దోచుకున్న బొల్లా బ్రహ్మనాయుడును చిత్తుగా ఓడించేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలన్నారు. ఇంటింటికి తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తే అందించే సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల గురించి వివరించారు. రైతులకు కనీసం రెండు పంటలకు సాగునీటిని అందించేందుకు గోదావరి జలాలను అనుసందానం చేస్తామని ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండలపార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, ఐనాల కోటేశ్వరరావు, గోలి అప్పారావు, కూరాకుల శ్రీనివాసరావు, నిశ్శంకరరావు అంకారావు, నరసింహారావు, చంద్రరావు, సుబ్బారావు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి సురక్షితంగా బ్యాగ్ అందజేత


ప్రయాణికురాలికి బ్యాగ్ అప్పగిస్తున్న కండెక్టర్, డ్రైవర్

వినుకొండ, ఏప్రిల్ 25: బస్సులో ప్రయాణికురాలు బ్యాగ్ వదిలివెళ్లగా కండెక్టర్, డ్రైవర్ గుర్తించి అధికారుల సమాచారం మేరకు ప్రయాణికురాలకు అందించిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలను పరిశీలిస్తే వినుకొండ డిపోకు చెందిన ఒక ప్రైవేటు బస్సు విజయవాడ నుంచి వినుకొండకు వస్తున్న క్రమంలో నర్సరావుపేటలో డ్రైవర్ కండెక్టర్ టీకి వెళ్ళగా ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామానికి చెందిన పేరూరి సుజాత టాయిలెట్‌కని బస్సు దిగింది. ఇంతలో డ్రైవర్ కండెక్టర్లు గమనించకుండా బస్సును వినుకొండకు తరలించారు. అక్కడ బ్యాగును గమనించి, అధికారుల సూచనలు మేరకు బ్యాగ్‌ను భద్రపరిచిన కండెక్టర్, డ్రైవర్లు అధికారులకు అందజేశారు. ప్రయాణికుల సమక్షంలో అధికారులు బ్యాగ్ తెరిచి చూడగా బ్యాగ్‌లో సుమారు 10లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు గుర్తించారు. ప్రయాణికురాలు గుర్తింపుకార్డులతోపాటు బంగారానికి సంబంధించిన ఆధారాలను గుర్తించి ప్రయాణికురాలికి అందజేశారు. అనంతరం డిపో మేనేజర్, కండెక్టర్, డ్రైవర్‌లను ఈ సందర్భంగా అభినందించారు.

కార్మిక పోరాటాలను బలోపేతం చేయండి

● ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 25: చికాగో అమరుల త్యాగాలస్ఫూర్తితో కార్మిక పోరాటాలను బలోపేతం చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బీ కొండారెడ్డి అన్నారు. గురువారం నరసరావుపేట పట్టణంలోని ఎన్‌జీవో హోమ్‌లో ప్రజాసంఘాల నాయకులు మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీ కొండారెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొని వచ్చిందని విమర్శించారు. మేడే 1 నుంచి కార్ల్ మార్క్స్ జయంతి మే 5వరకు ఊరూరా జరపతలపెట్టిన మేడే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటి సభ్యులు కంబాల ఏడుకొండలు, దేవదానం, సాల్మన్ రాజు, చైతన్య గ్యాస్ వర్కర్స్ యూనియన్ నాయకులు దాసరి శ్రీనివాసరావు, బంగారు బాబు, కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, ఉపాధ్యక్షుడు గొల్లపూడి చిన్నప్రసాద్, సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, స్వరూప్, అశ్విని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిలార్, ఎంసీపీఐ నాయకుడు రెడ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వే లక్ష్యం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 25: రాష్ట్రంలో ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వే లక్ష్యంగా తమ ప్రభుత్వ ప్రజాపాలన ఉంటుందని మాజీమంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహిళలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ప్రతిపాటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగు, జనసేన వీర మహిళలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ గెలుపు కోసం మహిళలు ప్రతి గడపకు వెళ్ళి ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ బడి ఈడు పిల్లల నుంచి గృహిణుల వరకు మహిళలందరికీ మేలు చేసేలా సూపర్-6 పథకాలు రూపొందించారన్నారు. ఆర్థిక భరోసా ఇచ్చి అవకాశాలకు ఊతమిచ్చి భద్రత విషయంలో అండగా నిలిచే వరకు పెద్దన్న పాత్ర పోషిస్తామని చంద్రబాబు నాయుడు మహిళలందరికీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఐదు సంవత్సరాల్లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన దాడులు, హత్యాచారాలను గుర్తు చేసుకుంటే ఏ మహిళ కూడా వైసీపీకి ఓటు వేయరన్నారు. సొంత చెల్లెళ్ళను రోడ్డు పాలు చేసి వివేకా హత్య కేసులో వారిని అనరాని మాటలను అనిపిస్తున్న పరిణామాలు చూసిన తరువాత ఆ యావగింపు మరింత పెరిగిందన్నారు. ఓటర్లను ప్రభావం చేసే శక్తి మహిళలకే ఉందన్నారు. నాసిరకం మద్యంపై విస్తృత ప్రచారం చేయాలని, పేదల బలహీనతలను జగన్‌రెడ్డి సొమ్ము చేసుకొని మోసం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ ప్రభుత్వ వైఫల్యాలన్నీ ప్రజలకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన మహిళలు పాల్గొన్నారు.

మహిళలను శక్తి వంతులుగా తీర్చిదిద్దే బాధ్యత కూటమిదే

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 25: రాష్ట్రంలో మహిళలను శక్తి వంతులుగా తీర్చిదిద్దే బాధ్యత రానున్న టీడీపీ కూటమి ప్రభుత్వానిదేనని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి అన్నారు. గురువారం పట్టణంలోని 13వ వార్డు చార్లెస్ కాలనీ వద్ద నుంచి మారుతీ నగర్, శ్రీనివాసనగర్ వరకు విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి మహిళను తన ఆడపడుచుగా భావించి వారి సాధికారితకు చంద్రబాబు నాయుడు కృషి చేస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రత్తిపాటి వెంకట కుమారి

పలువురు టీడీపీలో చేరిక

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 25: ఒక్క ఛాన్స్ అంటూ ప్రజల నెత్తిన ఎక్కి తుగ్లక్ తాతలా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నవ్వుల పాలుచేశారని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు జరిగాయి. యలగాల నాగరాజు మిత్ర మండలి ఆధ్వర్యంలో 70 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ అమరావతిపై కక్షపెంచుకొని తెరపైకి తెచ్చిన మూడు రాజధానులతో జగన్ ఏం సాధించారని ప్రశ్నించారు. టీడీపీ కూటమి విజయానికి అందరూ నిబద్ధతతో పనిచేయాలని, తనను, ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

జగన్ సర్టిఫికెట్ల బిజినెస్ పెట్టుకోవాలి

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 25: వైసీపీ అభ్యర్థులందరినీ మంచి వారు, సౌమ్యులు, పేదలు అంటూ ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు తనదైన శైలిలో మాజీ మంత్రి, టీడీపీ కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు చురకలు వేశారు. గురువారం పట్టణంలోని 33వ వార్డులో ప్రత్తిపాటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంజీవనగర్ చర్చిలో పుల్లారావు ప్రార్థనలు నిర్వహించారు. ఆది ఆంధ్రా కాలనీ నుంచి శాంతి నగర్ వరకు ఇంటింటికి వెళ్ళి టీడీపీ సూపర్ - 6 పథకాల పై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్ రౌడీలను, హంతకులను మద్యం, ఎర్రచందనం స్మగ్లర్లను పక్కన పెట్టుకొని వీళ్లంతా మంచి వారు అంటున్నారన్నారు. గులకరాయి దొంగ డ్రామాలు ఆపక పోతే ప్రజలు చీకొట్టడం ఖాయమన్నారు. ఎన్నికలకు ఏడాది సమయం ముందు నుంచే తన వైఫల్యాలపై చర్చ జరగకుండా తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులతో ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఓటమి ఖాయం అయ్యాక కొత్త నాటకాలు మొదలు పెట్టారన్నారు. ప్రజలు కూటమి వైపు నిలుస్తున్నారని, జూన్ 4 తరువాత రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అని ధీమా వ్యక్తం చేశారు.

పల్నాడు గడ్డపై గోపిరెడ్డికి ఓటమి ఖాయం

కూటమి అభ్యర్థి డాక్టర్ అరవింద బాబు


30వ వార్డులో టీడీపీలో చేరిన వారితో డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 25: పల్నాడు గడ్డపై వైసీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఓటమి ఖాయమని డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. పట్టణంలోని 30వ వార్డు ఏనుగుల బజార్‌లో డాక్టర్ చదలవాడ అరవింద బాబు సమక్షంలో ఆకుల శ్రీను, బోండాల కృష్ణ సమక్షంలో 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ చేరికలు గోపిరెడ్డికి వణుకు పుట్టిస్తున్నాయన్నారు. గోపిరెడ్డిని గద్దె దించడమే లక్ష్యంగా వైసీపీ కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గానికి చిన్న మేలు కూడా చేసింది లేదంటూ ధ్వజమెత్తుతున్నారు. వైసీపీలో బడుగు, బలహీన వర్గాలకు గుర్తింపులేదంటూ ఆవేదనతో పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని కూడా అంతంత మాత్రంగానే చేస్తున్నారన్నారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఓడిపోయేచోట ఖర్చుపెట్టడం అవసరమా అని సన్నిహితుల వద్ద అంటున్నారని, ఓటమి తప్పదని తెలిసీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారన్నారు.

వైద్యులను వేధించిన వైసీపీని గద్దె దించుదాం


వైద్యులను సన్మానిస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 25: సమాజమే దేవాలయమనేది టీడీపీ నినాదం. సమాజం ఉన్నదే దోచుకోవటానికన్నది వైసీపీ నినాదం అని ఉమ్మడి టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరోపించారు. నరసరావుపేట పట్టణంలోని కపిలవాయి విజయ్ కుమార్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఆర్ఎంపీల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ చదలవాడ అరవింద బాబు, లావు మేఘన, పట్టణంలోని ముఖ్య డాక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులను వేధించిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని వైద్యులకు అండగా నిలిచే బాధ్యత తీసుకుంటానని ఎన్డీఏ కూటమి నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవింద బాబు హామీ ఇచ్చారు. జగన్ రెడ్డి ధన దాహం కారణంగా రాష్ట్రంలో వేలాది మంది బడుగుబలహీన వర్గాలకు చెందిన పేదలు కల్తీ మద్యంతో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జగన్ రెడ్డి లాంటి దోపిడీదారుని రాష్ట్రం నుండి తరిమేందుకు వైద్యులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. నర్సీపట్నంలో డాక్టర్ సుధాకర్, చిత్తూరులో డాక్టర్ అనితారాణి లాంటి వారిని వేధించిన విధానం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

చిలకలూరి పేటలో 33 మంది నామినేషన్లు

చిలకలూరిపేట, ఏప్రిల్ 25: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో పోటీకోసం మొత్తం 33మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేసినట్లు గురువారం సాయంత్రం ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీ నారదముని తెలిపారు. వీరు మొత్తం 49నామినేషన్‌లను దాఖలు చేసినట్టుగా పేర్కొన్నారు. గురువారంతో నామినేషన్‌ల దాఖలు కోసం గడుడు ముగిసింది. చివరి రోజున మూడు గంటలలోపే పలువురు నామినేషన్‌లను దాఖలు చేయటానికి ఆర్వో కార్యాలయం వద్దకు వచ్చారు. సమయానికి కార్యాలయం లోపలకు వచ్చిన అభ్యర్థులు ఎక్కువమంది ఉండటంతో వీరిలో ఆరుగురికి స్లిప్‌లు ఇచ్చి వరుస క్రమంలో నామినేషన్‌లు స్వీకరించారు. ప్రధానంగా తెలుగుదేశం పార్టీ తరుపున ప్రత్తిపాటి పుల్లారావు, వైసీపీ తరుపున కావటి శివనాగమనోహర నాయుడు, కాంగ్రెస్ పార్టీ తరపున మద్దుల రాధాకృష్ణ పోటీలో ఉన్నారు. వీరు కాక ఇతర పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలుచేసిన వారిలో ఉన్నారు.

అగ్నిప్రమాదంలో గడ్డి వాములు, దిబ్బలు దగ్ధం

కొండ్రముట్ల (ఈపూరు) ఏప్రిల్ 25: ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో నాలుగు వరిగడ్డి వాములు, రెండు ఎరువుదిబ్బలు కాలిబూడిదయ్యాయి. గురువారం సాయంత్రం ప్రమాదంలో కొనతల పిచ్చిరెడ్డికి చెందిన నాలుగు ఎకరాలు, నలబోతుల సాగర్‌కు చెందిన ఎకరం గడ్డివాములు, పుల్లగిరి శ్రీనివాసరెడ్డి జైరాజులకు చెందిన రెండు ఎరువు దిబ్బలు కాలిపోయాయి. నష్టం విలువ సుమారు లక్షరూపాయలు వరకుఉంటుందని బాదితులు తెలిపారు. వినుకొండ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

తప్పించుకు తిరుగుతున్న నిందితుడు అరెస్టు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 25: చెల్లని చెక్కు కేసులో శిక్ష విధింపబడి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన లక్ష్మీ రఘు రామ ట్రేడర్స్ నిర్వాహకుడు బచ్చు శ్రీనివాసరావుకు నిందితుడికి 2022లో ఏడాది జైలు శిక్ష, రూ.50 లక్షలు నష్ట పరిహారాన్ని అమలు చేయాలని న్యాయాధికారి ప్రవలిక ఆదేశాలు జారీచేశారు. పట్టణానికి చెందిన తటవర్తి వెంకటేశ్వర్లు వద్ద నిందితుడు వ్యాపార నిమిత్తం రూ.25లక్షలు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపుల్లో భాగంగా 2022కు ముందు రూ.25 లక్షలకు చెక్కు ఇచ్చాడు. అది చెల్లలేదు. ఈ మేరకు వెంకటేశ్వర్లు శ్రీనివాసరావు, మరొకరిపై కోర్టులో కేసు దాఖలు చేసుకున్నారు. విచారణలో నేరం రుజువవ్వటంతో పైవిధంగా కోర్టు తీర్పు వెలువడింది.

తీర్పు సమయంలో నిందితుడు హాజరు కాకపోవటంతో నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ చేస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. అప్పటినుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసి గురువారం కోర్టులో ప్రవేశ పెట్టగా కోర్టు పైవిధంగా ఆదేశాలు జారీ చేసింది.

మహిళలకు మత్తుమందిచ్చి చెవికమ్మల అపహరణ

చిన్నకంచెర్ల (శావల్యాపురం) ఏప్రిల్ 25: సాధువుల వేషంలో విరాళం కోసమని వచ్చి మహిళలకు మత్తుమందు ఇచ్చి వారి చెవులకున్న బంగారు చెవికమ్మలను తీసుకొని ఉడాయించిన సంఘటన మండలంలోని చిన్నకంచెర్లలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చిన్నకంచెర్ల గ్రామానికి చెందిన బచ్చలకూరపాటి నాగలక్ష్మి, ఆమె కుమార్తె ఇంట్లో ఉండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సాధువుల వేషంలో విరాళం ఇవ్వమని వచ్చారు. ఇంటి యజమానికి ప్రమాదం జరగబోతుందని, గుమ్మానికి పెద్ద బూడిద గుమ్మడికాయ కడితే ప్రమాదం తప్పిపోతుందని నమ్మించారు. నాగలక్ష్మికి, ఆమె కుమార్తెకు పసుపు, కుంకుమలు ఇచ్చి చేతిలో తీర్థం పోశారు. వాటిని తాగిన నాగలక్ష్మి, ఆమె కుమార్తె స్పృహ తప్పడంతో వారిద్దరి చెవులకున్న రెండు అరసెవర్ల చెవికమ్మలను తీసుకొని అక్కడి నుంచి బైకుపై ఉడాయించారు. అంతలో ఇంటికొచ్చిన నాగలక్ష్మి కుమారుడు వారిద్దరినీ లేపడంతో వారి చెవులకున్న కమ్మలు లేవని గుర్తించి లబోదిబోమన్నారు. స్థానికులను ఆరా తీయగా సాధువులిద్దరూ శానంపూడి మార్గంలో వెళ్ళినట్లు తెలిసింది. నాగలక్ష్మి స్థానికులతో కలసి వెళ్ళి శానంపూడిలో బైకుపై వెళుతున్న సాధువులను ఆపి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు వచ్చి వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాధువులిద్దరూ సత్తెనపల్లి దగ్గర బెల్లంకొండ గ్రామానికి చెందిన గంధం అంజి, పర్వతం తిరుమలరాజుగా గుర్తించారు. వారిద్దరిపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

సీజీజీబీలో ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలి

శావల్యాపురం, ఏప్రిల్ 25: స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో ఆధార్‌కేంద్రాన్ని పునఃప్రారంభించారని, మండల ప్రజలంతా ఆధార్ సేవలను వినియోగించుకోవాలని బ్యాంకు మేనేజర్ వల్లేటి శివకృష్ణ కోరారు. బ్రాంచ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. నూతన ఆధార్, 5ఏళ్ళు నిండిన పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలను ఉచితంగా అందిస్తారన్నారు. ఆధార్‌కార్డులో పేర్లు, చిరునామాల సవరణలకు రూ.50, బయోమెట్రిక్ అప్‌డేట్‌కి రూ.100 చొప్పున రుసుం చెల్లించాల్సి ఉంటుదన్నారు. ఆధార్ కార్డులో వయసు మార్పిడి చేయాలంటే విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఆయనతో అసిస్టెంట్ మేనేజర్ సుధీర్ పాల్గొన్నారు.

వైభవంగా నల్లంత ఆంజనేయ స్వామి తిరునాళ్ల

రొంపిచర్ల, ఏప్రిల్ 25: మండలంలోని మాచవరంలోని నల్లంత ఆంజనేయ స్వామి తిరునాళ్ళ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, నాగవల్లి దళార్చన పూజలను నిర్వహించారు. మాచవరం, నలగార్లపాడు, పరగటిచర్ల, గ్రామాల నుంచి మహిళలు విచ్చేసి పొంగళ్ళు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారిని దర్శించుకున్నారు. చిన్నారులు మొక్కుబడి ప్రభలను నిర్మించారు.

వినుకొండలో 39 నామినేషన్లు దాఖలు

వినుకొండటౌన్, ఏప్రిల్ 25: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వినుకొండ ఎమ్మెల్యేగా మొత్తం 24 మంది అభ్యర్థులకుగాను 39 నామినేషన్ దాఖలు చేయగా వారిలో నలుగురు మహిళలు ఉన్నా రు. గురువారం చివరి రోజు కావడంతో మొత్తం 12మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. వలపర్ల రమేష్ (లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ), జాల ప్రసన్న (ఇండియన్ కాంగ్రెస్), చిరంజీవి నాయక్ (జైభారత్ నేషనల్ పార్టీ), మాసిపోగు ఏసుబాబు (బీఎస్‌పీ), వేముల శ్రీనివాసరావు (ఆల్‌పీపుల్స్‌పార్టీ), టి.అనిల్‌కుమార్ (జాతీయ జనసేనపార్టీ), కూచిపూడి వియజ్‌కుమార్ (ఇండిపెండెంట్), చెన్న శ్రీనివాసరా వు (నేషనల్ కాంగ్రెస్ పార్టీ), ములక సీతారాం(ఇండిపెండెంట్), ధర్నాశి రామకోటమ్మ (ఇండిపెండెంట్), కూకటపల్లి ప్రసాద్ (జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ), జెడ్డా శ్రీనివాసరావు (ఇండిపెండెంట్)లు నామినేషన్ దాఖలు చేశారు.


బొమ్మరాజుపల్లిలో పోలింగుబూతులను పరిశీలిస్తున్నఎస్పీబిందుమాధవ్

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

● ఎస్పీ బిందుమాధవ్

ఈపూరు, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాదవ్ చెప్పారు. మండలంలోని ఇనుమెళ్ళ,బొమ్మరాజుపల్లి,ఈపూరు,అంగలూరు,బొగ్గరం గ్రామాలలోని పోలింగ్ బూత్‌లను గురువారం ఎస్పీ పరిశీలించారు. బూత్‌లలోని వసతులను, వెబ్ కెమేరాల ఏర్పాటును అధికారులతో మాట్లాడారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు.గ్రామాల్లో అల్లర్లకు పాల్పడే వారిపై ఎలాంటి చర్యలు తీసుకునేందుకైన వెనుకాడబోమన్నారు.జిల్లాలో 587 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించామన్నారు. అదేవిధంగా 150 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 12వేల మందిని బైండోర్ చేసి కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు.

ఎలుకల మందు తిని మహిళ మృతి


మృతి చెందిన లక్ష్మీదేవి

నాదెండ్ల, ఏప్రిల్ 25 : కొడుకును బెదిరించేందుకు ఎలుకల మందు తిని ఒక మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని గణపవరం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల లక్ష్మీదేవి(36), భర్త రాముడు ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆమె కుమారుడు శివరామ్‌తో కలసి రాజీవ్‌గాంధీ కాలనీలో నివాసం ఉంటుంది. శివరామ్ రేకుల పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో పది రోజుల క్రితం పనుల కోసం నెల్లూరు వెళ్ళాడు. తనకు డబ్బులు కావాలని తల్లి లక్ష్మీదేవి కోరటంతో రూ వెయ్యి రూపాయలు పంపాడు. ఆ సొమ్ము చాలదని, మరికొంత పంపక పోతే తాను చని పోతానంటూ ఆమె కొడుకును బెదిరించింది. ప్రస్తుతం డబ్బులు లేవు, తరువాత పంపుతానని చెప్పినా వినకుండా ఎలుకల పేస్టును బుధవారం తిన్నది. కడుపు నొప్పినతో అల్లాడుతున్న ఆమెను చిన్నమ్మ కుమార్తె నాగలక్ష్మి గుర్తించింది. చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లక్ష్మీదేవి గురువారం ఉదయం మృతి చెందింది. ఎస్ఐ బల రామిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

యడ్లపాడు, ఏప్రిల్ 25: మండలంలోని జాతీయ రహదారిపై ఎర్రకొండ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన ఒక యువకుడు బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. చిలకలూరిపేట నుంచి గుంటూరు వెళ్ళే మార్గంలో గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతనిపై నుంచి వాహనాలు వెళ్ళటంతో తల, మొండెం వేరై ఛిద్రమైంది. నీలి రంగు ఫ్యాంట్ వేసుకున్న అతని ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని యడ్లపాడు పోలీసులు తెలిపారు. అతని మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచారు.